ప్రజాశక్తి

మంగళవారం 28 జనవరి 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

లావాదేవీలు ఊపందుకునేనా?

రాజధానికి రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు మినహాయింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని అమరావతిలో ఆరు నెలలుగా భూముల క్రయవిక్రయాలు మందగమనంగా కొనసాగుతున్నాయి. భూ యజమానులు ధరలను భారీగా పెంచడం వల్ల ఎక్కువ మంది రాజధాని గ్రామాలకు వచ్చి వెళ్తున్నారే కానీ కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలో రాజధాని గ్రామాలకు రిజిస్ట్రేషన్ విలువ పెంపు ఉండదని ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ఫిబ్రవరి 1 నుండి రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రిజిస్ట్రేషన్ విలువలు అమలులోకి రానుండగా రాజధాని పరిధిలోని 29 గ్రామాలకు మినహాయింపు ఇచ్చారు. అయితే రాజధాని గ్రామాల్లో మాత్రం రిజిస్ట్రేషన్ విలువల్లో మార్పు ఉండదని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించారు. క్రయ విక్రయాలు ఎక్కువగా ఉండి, రిజిస్ట్రేషన్ విలువ కంటే మార్కెట్ విలువ 10 రెట్లు అదనంగా ఉన్న ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ విలువలు పెంచనున్నారు. రాజధాని గ్రామాల్లో మాత్రం లావాదేవీలు మందగమనంగా ఉండటం వల్ల పెంపు ప్రతిపాదనలను 29 గ్రామాల్లో మినహాయింపు ఇచ్చారు.

ప్రస్తుతం రాజధాని గ్రామాల్లో ప్రధాన రహదారుల పక్కన ఉన్న భూముల్లో గజం రూ.70 వేల వరకు పలుకుతోంది. మెట్ట ప్రాంతంలో కనిష్ఠంగా రూ.40 వేలు, గరిష్ఠంగా రూ.50 వేలు పలుకుతుండగా జరీబు గ్రామాల్లో కనిష్ఠంగా రూ.50 వేలు, గరిష్ఠంగా రూ.80 వేల వరకు చెబుతున్నారు. దీంతో ఈ ధరలకు కొనుగోలు దారులు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికే ధరలు అధికంగా ఉన్నందున మళ్లీ భూముల విలువ పెంచితే ఇబ్బందులు వస్తాయని, కొనుగోలు దారులపై ఛార్జీల భారం కూడా పడుతుందనే భావనతో ప్రభుత్వం మినహాయింపు నిర్ణయాన్ని తీసుకున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. రాజధాని గ్రామాల కంటే తాడికొండ, అమరావతి, క్రోసూరు, పెదకూరపాడు, సత్తెనపల్లి, మంగళగిరి, తాడేపల్లి, పెదకాకాని మండలాల్లోనే అధికంగా లావాదేవీలు జరుగుతున్నాయి. రాజధానిలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులన్నీ వేగం పుంజుకుంటే క్రయ విక్రయాలు ఊపందుకుంటాయని రైతులు, భూ యజమానులు భావిస్తున్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి, ఇతర నాయకులు

సిపిఎం రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

రాజధాని నిర్మాణం - రాష్ట్రాభివృద్ధిపై 30, 31 తేదీల్లో తాడేపల్లి నుండి జాతా

ప్రజాశక్తి-గుంటూరు

నెల్లూరు నగరంలో 1, 2, 3 తేదీల్లో నిర్వహిస్తున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభను పురస్కరించుకొని ఈనెల 30, 31వ తేదీల్లో తాడేపల్లి నుండి నెల్లూరు వరకు జరిగే 'రాజధాని నిర్మాణం-రాష్ట్రాభివృద్ధి' జాతాను జయప్రదం చేయాలని ఆ పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజి కోరారు. సోమవారం బ్రాడీపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. జాతాను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్.బాబురావు ప్రారంభిస్తారని, వై.నేతాజి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రవి, బి.వెంకటేశ్వర్లు జాతాకు నాయకత్వం వహిస్తారని, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు, ఎన్.భావన్నారాయణ, ఈమని అప్పారావు, కె.నళినీకాంత్‌లు పాల్గొంటారని చెప్పారు. 30వ తేదీన ఉదయం 9 గంటలకు గత రాష్ట్ర మహాసభలు జరిగిన తాడేపల్లిలో జాతా ప్రారంభమై మంగళగిరి, తుళ్లూరు, తాడికొండ, పెదకాకాని మీదగా సాయంత్రానికి గుంటూరు చేరుకుంటుందన్నారు. 31వ తేదీన గుంటూరు నుండి బయలుదేరి ఉదయం 9 గంటలకు

▶ 2లో

సమస్యలనేకం.. మాట్లాడతారా కనీసం..

- నేడు డిఆర్‌సి సమావేశం
- హాజరుకానున్న ఇన్‌ఛార్జి మంత్రి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం మంగళవారం ఉదయం 10.30 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో జరగనుంది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన జరగనుంది. వ్యవసాయం, అనుబంధ రంగాలు, పరిశ్రమలు, స్కిల్ డెవలప్‌మెంట్, గుంటూరు నగర పాలక సంస్థ, మంగళగిరి నగర పాలక సంస్థ, గృహ నిర్మాణం, డ్వామా, వైద్య ఆరోగ్యశాఖతో మహిళా శిశు సంక్షేమంపై చర్చ జరుగుతుందని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేషశ్రీ తెలిపారు. జిల్లాకు చెందిన ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఈ సమావేశంలో పాల్గొంటారన్నారు.



ధాన్యం కొనుగోలుపై ప్రస్తుతం ప్రతిష్టంభన నెలకొంది. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 26 వేల టన్నులే కొనుగోలు చేశారు. జిల్లాలో వరి సాగైన 1.42 లక్షల ఎకరాల నుండి 3.75 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుండగా 10 శాతం కూడా ఇప్పటి వరకు కొనుగోలు చేయలేదు. ఈ అంశంపై ప్రజా ప్రతినిధులు చర్చించే అవకాశం ఉంది. పత్తి, మిర్చి, అపరాల ధరలు బాగా తగ్గడం వల్ల రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. మరో రెండు నెలల్లో కాల్వల మరమ్మతులు చేయాల్సి ఉంది. గత ఐదేళ్లుగా నీటి పారుదల రంగాన్ని నిర్లక్ష్యం చేసినట్టు ఆరోపిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు వచ్చే ఖరీఫ్‌కు ముందుగానే మరమ్మతులపై దృష్టిసారించాల్సి ఉంది. జిల్లా నీటి పారుదల అభివృద్ధి మండలి (ఐడిబి) పునరుద్ధరించి నెలకు ఒకసారి సమావేశం నిర్వహించి రైతుల సమస్యలపై చర్చించాల్సి ఉండగా గత ఐదేళ్లుగా ఈ సమావేశాలు జరగడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఇంత వరకు ఐడిబిని పునరుద్ధరించలేదు.

రేషన్ బియ్యం మాఫియా పెట్రోగిపోతోంది. రేషన్ వాహనాల నుంచి వినియోగదారులకు బియ్యం ఇవ్వకుండా కిలో రూ.10 నుంచి 12 వరకు సొమ్ములు ఇస్తున్నారు. జిల్లాకు చెందిన పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లాలోనే రేషన్ మాఫియా అడ్డూఅదుపు లేకుండా ప్రవరిస్తోంది. రేషన్ మాఫియా నియంత్రణకు సిట్‌ను నియమించినా ఇంత వరకు స్పందన లేదు. పరిశ్రమలు, నైపుణ్య శిక్షణపై క్షేత్రస్థాయి పరిశీలన కొరవడింది. వివిధ రంగాలకు చెందిన కార్మికులు వేలాది మంది ఉన్నా వారికి తగిన శిక్షణ ఇవ్వడం లేదు. చదువుకున్న నిరుద్యోగుల్లో కొద్ది మందికే శిక్షణిస్తున్నారు. చిన్న, మధ్య

▶ 2లో

స్టాండింగ్ కమిటీ నామినేషన్ల పరిశీలన పూర్తి - 2 లో



ఐక్యతా అభివాదం చేస్తున్న కెఎస్ లక్ష్మణరావు, వివిధ సంఘాల నాయకులు

ప్రజాసమస్యలపై మాట్లాడేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలే

ఆత్మీయ సమావేశంలో ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు

2 లో



బాధితుల భూములను, వాటికి సంబంధించిన పట్టాలు, మ్యాప్‌లను పరిశీలిస్తున్న నాయకులు

పొలాల్లోకి రానివ్వకుండా కేసులు

డీకే పట్టా భూములను బాధితులతో కలిసి పరిశీలించిన రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు

ప్రజాశక్తి - అచ్చంపేట

తమ భూముల్లోకి తాము వెళ్లకుండా అటవీ శాఖాధికారులు అడ్డుకుంటున్న నేపథ్యంలో బాధిత రైతులు రైతు సంఘాన్ని ఆశ్రయించారు. దీంతో

▶ 2లో

వేతనాల కోసం సామూహిక దీక్షలు

- గుంటూరు, నరసరావుపేటలో విఒఎల నిరసన ప్రారంభం
- గతంలో మాటిచ్చి ఇప్పుడు మాట్లాడ్డం లేదని టిడిపి నాయకులపై విమర్శలు
- నెలలతరబడి వేతన పెడింగ్‌లతో జీవనం ఎలాగని ఆవేదన
- కాలపరిమితి సర్క్యులర్ రద్దు, పని భద్రత కోసం డిమాండ్

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు

యానిమేటర్ల 6 నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని, మూడేళ్ల కాలపరిమితి రద్దు చేయాలని, తదితర డిమాండ్లపై యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో గుంటూరు, నరసరావుపేటలో సోమవారం సామూహిక నిరసన దీక్ష చేపట్టారు. రాష్ట్రవ్యాప్త

▶ 2లో



గుంటూరు, నరసరావుపేటలో దీక్ష శిబిరాల్లో యానిమేటర్లు



స్టాండింగ్ కమిటీ నామినేషన్ల పరిశీలన పూర్తి

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు నగరపాలకసంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు దాఖలైన 17 నామినేషన్ల పరిశీలనను ఎన్నికల అధికారి, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు సమక్షంలో సోమవారం నిర్వహించారు. అభ్యర్థుల సమక్షంలో నామినేషన్లు పరిశీలన పూర్తి చేసి, 17 నామినేషన్లూ పోటీకి అర్హత సాధించాయని ప్రకటించారు. 30వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందని, అదేరోజు పోటీలో ఉండే తుది అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని తెలిపారు. ఫిబ్రవరి 3వ తేదీ ఎన్నికలు జరగనున్నాయి.

యువతిపై యువకుడి దాడి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల : యువతిపై యువకుడు దాడి చేసిన ఘటన మండలంలోని గుత్తికొండ అటవి ప్రాంతంలో సోమవారం జరిగింది. పట్టణ ఎస్ఐ మోహన్ వివరాల ప్రకారం.. నకరికల్లుకు చెందిన ఓ యువతి నర్సరావుపేటలో బి ఫార్మసీ చివరి సంవత్సరం చదువుతున్నారు. కారంపూడిలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లి వచ్చే క్రమంలో మల్లిఖార్జునతో పరిచయం, అనంతరం ఐదేళ్లుగా వారు ప్రేమించుకుంటున్నారు. అయితే రెండు నెలలుగా యువతి మరొకరితో మాట్లుడుతుందనే అనుమానంతో ఆమెను మల్లికార్జున సోమవారం గుత్తికొండ శివారు అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి కర్రతో దాడి చేశాడు. తల, ఎడమ చేయి, కాలికి తీవ్రగాయాల పాలైన యువతి కేకలు వేయడంతో అటుగా వెళుతున్న వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు.. ఆమెను నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేశారు.



బీసీలకు 33 శాతం రిజర్వేషన్‌కు అడుగులు

సన్మాన సభలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : బలహీన వర్గాలవారు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలంటే ఐక్యత అవసరమని పలువురు రాష్ట్ర మంత్రులు అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఎమ్మెల్యే గల్లా మాధవి ఆధ్వర్యంలో గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బిసి మంత్రుల అభినందన సభ సోమవారం జరిగింది. కేంద్ర మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు కింజరపు అచ్చెన్నాయుడు, ఎస్.సవిత, కొలుసు పార్థసారధి, కొండపల్లి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించటానికి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ద్వారా నైపుణ్యం శిక్షణ అందిస్తున్నారన్నారు. బిసి కులాలకు దామాషా ప్రకారం ఆర్థిక అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నారన్నారు. బిసిలకు 33 శాతం రిజర్వేషన్లు తెచ్చే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. మెగా డీఎస్సీకి 26 జిల్లాలలో బిసి స్టడీ సర్కిల్ ద్వారా శిక్షణ అందిస్తున్నామని, బిసి హాస్టల్స్, బిసి భవనాలు నిర్మాణానికి కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేలు మహ్మద్ నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ కుమార్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడారు. మంత్రులు, ఎమ్మెల్యేలను సత్కరించారు. కార్యక్రమాన్ని బి.శ్రీనివాసరావు నిర్వహించగా రాష్ట్ర ఇండస్ట్రీస్ ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, మాజీ డిప్యూటీ మేయరు తాడిశెట్టి మురళీమోహన్ పాల్గొన్నారు.

రహదారి భద్రత అందరి భాధ్యత..

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : రహదారి భద్రత అందరి భాధ్యతని పల్నాడు జిల్లా రహదారి భద్రతా కమిటీ కన్వీనర్ అయిన రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆర్.రాజానాయక్ అన్నారు. జాతీయ రహదారి భద్రతామాసోత్సవాల సందర్భంగా నరసరావుపేట పట్టణంలోని తన కార్యాలయంలో సూచనలతో కూడిన పోస్టర్లు విడుదల చేశారు.

ప్రజాసమస్యలపై మాట్లాడేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలే

ప్రజాశక్తి - మంగళగిరి : అన్ని వర్గాల ప్రజల సమస్యలను పరిష్కారానికి శాసనమండలిలో మాట్లాడేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనని ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు అన్నారు. పట్టణంలోని విజెపి అండ్ డిఎల్‌బి డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్స్, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్, సచివాలయ ఉద్యోగులు, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, పలు ప్రజాసంఘాల, కార్మిక, కర్షక, రైతు సంఘాల మంగళగిరి పట్టణం, రూరల్ కమిటీ ఆధ్వర్యంలో కెఎస్ లక్ష్మణరావును బలపరుస్తూ ఆత్మీయ సమావేశం సోమవారం జరిగింది. సమావేశానికి యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టి.ఆంజనేయులు అధ్యక్ష వహించగా కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ మార్చిలో జరిగే ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వంలోనూ ఉద్యోగులు, నిరుద్యోగులు, కార్మిక కర్షక రైతులు, అంగన్వాడీలు, ఆశ వర్కర్లు సమస్యలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. అధికారం మారినా ప్రభుత్వ విధానాల్లో మార్పులేదని విమర్శించారు. మంగళగిరి ప్రాంతం ఎంతో చైతన్యవంతమైందని, తనకు మద్దతుగా నిలవాలని కోరారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ కెవిఎస్ సాయి ప్రసాద్ మాట్లాడుతూ మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రి 100 పడకల ఆసుపత్రి మంజూరు చేయించడంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పాత్ర కీలకమైందని చెప్పారు. ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో అనేక ఏళ్లుగా సాగిన పోరాటంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీల పాత్ర మరువలేనిదన్నారు. ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వివి ప్రసాద్ మాట్లాడుతూ నిరుద్యోగులు, ప్రైవేట్ విద్యాసంస్థల సమస్యలు, ఉద్యోగుల, కార్మికుల సమస్యల గురించి కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, కనీసం మాట్లాడడానికి కూడా అవకాశం కల్పించడం లేదని అన్నారు. ఇలాంటి తరుణంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీగా కెఎస్ లక్ష్మణరావు గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో యుటిఎఫ్ నాయకులు యు.రాజశేఖర్, ఎ.శ్రీనివాసరావు, సిహెచ్ ఆదినారాయణ, జి.అచ్యుతరావు, సిఐటియు నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, ఎం.రవి, సిఐటియు నాయకులు జెవి రాఘవులు, వివి జవహర్లాల్, యు.దుర్గారావు, ఎం.భాగ్యరాజు, ఎం.బాలాజి, పెన్షనర్ అసోసియేషన్ అధ్యక్షులు వి.గోపిరెడ్డి, యుటిఎఫ్ నాయకులు ఎం.కోటిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఇ.అప్పారావు, చిన్న పరిశ్రమల అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.రామరాజు, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై చెన్నుపాటి ఇండో అమెరికన్ ఫార్మసీలోఅవగాహన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : సైబర్ నేరాల పట్ల యువత విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ కౌన్సిలర్ కొత్తపల్లి ప్రదీప్ అన్నారు. సైబర్ నేరాల నియంత్రణపై నరసరావుపేట మండలంలోని జొన్నలగడ్డలోని చెన్నుపాటి ఇండో అమెరికన్ స్కూల్ ఆఫ్ ఫార్మసీలో విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు జరిగింది. ప్రదీప్ మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఎటిఎం పిన్ నంబర్, సివివి నంబరు, బ్యాంకు ఖాతా వివరాలు అడితే చెప్పొద్దన్నారు. కళాశాల కార్యదర్శి చెన్నుపాటి సత్యనారాయణ మాట్లాడుతూ క్రమ శిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. రూరల్ ఎఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బెట్టింగ్ యాప్‌లకు, ఆన్‌లైన్ స్నేహాలు దూరంగా ఉండాలన్నారు. ఇకెవైసి అప్డేట్ చేయాలని వచ్చే కాల్స్, బ్యాంకు ఉద్యోగులుగా నమ్మిస్తూ సైబర్ నేరగాళ్లు బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేస్తున్నారని సోదాహరణగా వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నుపాటి వెంకట సురేష్, రీసెర్చ్ అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి.రఘువీర్ వర్మ, ఏఓ కె.రమేష్ పాల్గొన్నారు.

మా ఛారిటబుల్ ట్రస్ట్ సేవలకు జాతీయ స్థాయి గుర్తింపు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా: యాచకులకు, పారిశుధ్య కార్మికులకు, పేదలకు, రాత్రి వేళ రోడ్ల వెంట పడుకునే నిరాశ్రయులకు ఏడాది నుండి నిరంతరాయంగా ఆహారం, దుప్పట్లు పంపిణీ ఇతర సేవలు అందిస్తున్న 'మా' ఛారిటబుల్ ట్రస్ట్‌కు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఈ మేరకు 76 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా జమ్మూకాశ్మీర్ చెందిన ఇన్సెంటివ్ పోస్టర్ ఫౌండేషన్ జాతీయ స్థాయిలో గుర్తింపుగా సంస్థ నుండి ట్రస్ట్ వ్యవస్థాకులు డాక్టర్ స్వర్ణ నాగరాజు, డైరెక్టర్ బెల్లంకొండ అనిల్ కుమార్‌కు పోస్ట్ ద్వారా ప్రశంసా పత్రాలను పంపించారు.

సమస్యలనేకం.. మాట్లాడతారా కనీసం..

(మొదటి పేజీ తరువాయి)

తరహా పరిశ్రమలకు సంబంధించి గ్రామీణ స్థాయిలో నిరుద్యోగులను సమీకరించి వారికి అవసరమైన శిక్షణ, రుణ సదుపాయాలు కల్పించడంపై అధికారులు దృష్టి సారించడం లేదు. ఆరోగ్యశ్రీ కింద చేరే రోగులను కార్పొరేట్ ఆస్పత్రుల వారు ద్వితీయశ్రేణి పౌరులుగా చూస్తున్నారనే విమర్శలున్నాయి. దీనిపై పర్యవేక్షణ కొరవడింది. కేవలం ఆస్పత్రుల నిర్వాహకులు ఆన్‌లైన్‌లో రోగుల వివరాలు నమోదు చేయడం, ఇందుకు సంబంధించి చికిత్స, శస్త్ర చికత్సలు పూర్తయిన తరువాత వారికి కొన్ని నెలలకు సొమ్ము వస్తున్నాయి. ప్రభుత్వం నుంచి సొమ్ము ఆలస్యం కావడం వల్ల కూడా చికిత్సల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొంతమంది ప్రభుత్వం నిర్ధేశించిన సొమ్మునకు అదనంగా కూడా ఛార్జీలు వసూలు చేస్తున్నారు. వీటితోపాటు ఇతర సమస్యలపై సమావేశంలో చర్చించనున్నారని తెలిసింది.

సిపిఎం రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

మంగళగిరి, తుళ్లూరు, తాడికొండ, పెదకాకాని మీదగా సాయంత్రానికి గుంటూరు చేరుకుంటుందన్నారు. 31వ తేదీన గుంటూరు నుండి బయలుదేరి ఉదయం 9 గంటలకు నారాకోడూరు, తెనాలి, పొన్నూరు, బాపట్ల, చీరాల, ఓంగోలు మీదగా రాత్రికి నెల్లూరు చేరుకుంటుందని వివరించారు.

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర రాజధాని ఉనికి ప్రశ్నార్ధకంగా మారిందని, అమరావతిని రాజధానిగా నిలుపుకునేందుకు రైతులు, ప్రజలు ఉద్యమించగా వారిపై కేసులు, నిర్భంధాలు కొనసాగాయన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని, భవిష్యత్‌లో సందిగ్ధతకు అవకాశం లేకుండా చట్టం చేయాలని కోరారు. రాజధాని నిర్మాణానికి అవసరమైన రూ.50 వేలకోట్లు కేంద్రప్రభుత్వం గ్రాంట్‌గా ఇవ్వాలని, రైతులు, కూలీలు, కార్మికులు, చిరుద్యోగులు తదితరుల సమస్యలపై ప్రభుత్వం వేగంగా స్పందించి పరిష్కారం చేయాలని, ఇతర డిమాండ్లతో ఈ జాతా నిర్వహిస్తున్నామని తెలిపారు. జాతాలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర మహాసభ సందర్భంగా నెల్లూరులో ఫిబ్రవరి 3న ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతాయని, పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, ఎం.ఎ.బేబి, బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఎమ్.ఎ.గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి పాల్గొని ప్రసంగిస్తారన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు, ఎం.రవి, ఎన్.భావన్నారయణ, ఇ.అప్పారావు, కె.నళినికాంత్, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : 30వ తేదీన తాడేపల్లిలో ప్రారంభమయ్యే జాతాను జయప్రదం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు స్థానిక మేక అమరారెడ్డి భవన్‌లో నాయకులు కె.కరుణాకరరావు అధ్యక్షతన జరిగిన విస్తృత సమావేశంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతాంగ, కౌలు, వ్యవసాయ కార్మికులు, సామాన్య మధ్యతరగతి ప్రజల సమస్యలపైన, ఇళ్ల పట్టాలు ఇళ్ల స్థలాలు సమస్యపై నిరంతరం పోరాటం చేసే సిపిఎం ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందని అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని అర్హులైన పేదలందరికీ రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలం మంజూరు చేసి, గృహ నిర్మాణ పథకం కింద రూ.ఐదు లక్షలతో ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణంలో పశువుల ఆసుపత్రి వద్ద శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. స్థానికంగా పేదల నివసిస్తున్న ప్రాంతాలలో ఇళ్లపట్టాలను మంజూరు చేయాలని, స్థానికంగా మౌలిక వసతులు కల్పించాలని కోరారు. సమావేశంలో ఎం.శ్రీనివాసరెడ్డి, డి.విజయభాస్కరరెడ్డి, ఎ.శౌరి, కె.మేరీ, వి.శాస్త్రి, కె.బాబురావు పాల్గొన్నారు.

వేతనాల కోసం సామూహిక దీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

పిలుపులో భాగంగా మూడు రోజులపాటు ఈ దీక్షలు జరుగనున్నాయి. గుంటూరు కలెక్టరేట్ ఎదుట దీక్షలు యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ, పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని గాంధీ పార్క్ వద్ద ధర్నా చౌక్‌లో దీక్షలను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. ఆరు నెలలుగా వేతనాలు రాకపోతే కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. మండలాల్లో యానిమేటర్లను అక్రమంగా తొలగించడం తక్షణమే ఆపివేయాలని, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఉన్న మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని కోరారు. మండలాల్లో అధికారులు యానిమేటర్స్‌ను నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు యానిమేటర్ల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన టిడిపి కూటమి నాయకులు ఇప్పుడు కనీసం మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా యానిమేటర్లకు ఆరునెలల వేతన బకాయిలు ఉన్నాయని, దీన్ని బట్టే ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతోందని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా యానిమేటర్లకు వేతనాలు పెంచాలని, రాజకీయ వేధింపులు అక్రమ తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. గ్రామ స్థాయిలో విశేష సేవలతో పాటు మహిళ అభ్యున్నతికి, స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేస్తూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి తోడ్పడుతున్న విఎఎల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. మహిళలకు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేలా ప్రోత్సహించి, వారికి లోన్లు ఇప్పించి తిరిగి సక్రమంగా చెల్లించే విధంగా ఏళ్లతరబడి గ్రామాల్లో పని చేస్తున్న వారిపట్ల నిర్లక్ష్య వైఖరి తగదన్నారు. కనీస వేతనం రూ 26 వేలు అమలుతోపాటు సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. గుంటూరులో దీక్షకు సంఘం జిల్లా అధ్యక్షులు కె.పద్మ అధ్యక్షత వహించారు. గుంటూరు జిల్లా ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, సిఐటియు గుంటూరు తూర్పు కమిటీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి.సత్యనారాయణ మద్దతు తెలిపారు. యూనియన్ నాయకులు దేబోరా, విజయలక్ష్మి, షాజ, మేరీ, జ్యోతి, కనకదుర్గ పాల్గొన్నారు. నరసరావుపేటలో దీక్షకు రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు సంఘీభావం తెలిపారు. పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి, సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్.ఏసమ్మ, శైలజ, అనంతలక్ష్మి, అచ్చయ్య, హైమావతి, లోకయ్య, తేజ, సుజాత, మహాలక్ష్మి, ఉషారాణి, మాధవి, సుధామణి, రమణ పాల్గొన్నారు.

పొలాల్లోకి రానివ్వకుండా కేసులు

(మొదటి పేజీ తరువాయి)

మండల పరిధిలోని చెరుకుపాలెంలో భూములను రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఇతర నాయకులు సోమవారం పరిశీలించారు. డీకే పట్టా పొందిన సుంకర ఆదినారాయణ స్థానిక పరిస్థితిని వివరించారు. తాళ్లచెరువు రెవెన్యూ పరిధిలో చెరుకుంపాలెం గ్రామానికి చెందిన 100 మందికిపైగా పేదలకు తాళ్లచెరువు రెవెన్యూ సర్వే నంబర్ 320 నుండి 337 వరకు 1992లో అప్పటి గుంటూరు జాయింట్ కలెక్టర్, ఆర్‌డిఒ, అటవీ శాఖాధికారులు జాయింట్ సర్వే చేసి డీకే పట్టాలను మంజూరు చేయగా, 1993లో అప్పటి మంత్రి కన్నా లక్ష్మీనారాయణ వీటిని పంపిణీ చేశారు. ఈ భూములన్నీ ప్రస్తుతం సాగులో ఉన్నాయి. అయితే ఇవేవీ ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. దీంతో 40 మందికి చెందిన పొలాలు ఆటవీ భూములంటూ రెండేళ్ల నుండి ఆ భూముల్లోకి అటవీ శాఖ అధికారులు రానివ్వని కారణంగా తమ పొలాలు బీళ్లుగా మారాయని బాధితులు వాపోయారు. దీనిపై వి.కృష్ణయ్య మాట్లాడుతూ రైతుల భూములు కచ్చితంగా నిర్ధారిస్తామంటూ ఒకవైపు రీసర్వే చేయిస్తున్న ప్రభుత్వాలు మరోవైపు భూములు పొందిన రైతులను ఇబ్బంది పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. పొలాల్లోకి రానివ్వకపోగా కేసులు బనాయించడం సరికాదన్నారు. అధికారులు స్పందించి సత్వరమే సమస్యను పరిష్కరించాలని, లేకుంటే తహశీల్దార్, కలెక్టర్ కార్యాలయాల ఎదుట ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే సైతం దీనిపై దృష్టి పెట్టి రైతుల పక్షాన నిలవాలని కోరారు. భూములను పరిశీలించిన వారిలో బాధిత రైతులతోపాటు వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు, రైతుసంఘం నాయకులు ఆర్.వెంకటేశ్వర్లు, కౌలురైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల మండల కార్యదర్శులు ఆర్.హనుమంతరావు, కెకె రెడ్డి ఉన్నారు.

'రాతే మన భవిత' పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు రూరల్ మండలం, పొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల గణితశాస్త్ర ఉపాధ్యాయుడు ఉప్పాల రామమోహనరావు రూపొందించిన 'రాతే మన భవిత' పుస్తకాన్ని సమగ్రశిక్ష ఎఎస్‌పిడి కె.రవీంద్రనాద్‌రెడ్డి, డీఈవో సి.వి.రేణుక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీంద్రనాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు చేతిరాత నైపుణ్యంలో ఉచితంగా శిక్షణ కల్పిస్తూ ఉప్పాల రామమోహనరావు తనతో కలిసి వచ్చిన ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన క్యాలిగ్రఫీ ఫ్యామిలీ సత్ఫలితాలను ఇస్తోందని అన్నారు. గుంటూరు జిల్లాలో చేపట్టిన చేతిరాత ఉద్యమాన్ని ఇతర జిల్లాలకు విస్తరింపచేసిన క్యాలిగ్రఫీ టీం వేలాది మందికి శిక్షణ కల్పించడం సామాన్యమైన విషయం కాదన్నారు. డీఈవో సీవీ రేణుక మాట్లాడుతూ చేతిరాత నైపుణ్యంలో ఉచిత శిక్షణ కల్పించే కార్యక్రమాన్ని నిరంతరం ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్తున్న క్యాలిగ్రఫీ ఫ్యామిలీకి అభినందనలు తెలియజేశారు. విద్యావ్యవస్థలో మార్పులకు నాంది పలికే ఇటువంటి మంచి కార్యక్రమాలకు తమ ప్రోత్సాహం ఉంటుందని అన్నారు. పుస్తక రూపకర్త ఉప్పాల రామమోహనరావు మాట్లాడుతూ చేతిరాత నైపుణ్యంలో శిక్షణ కల్పించేందుకు ప్రపంచంలోనే తొలిసారిగా క్యూఆర్ కోడ్‌తో తీసుకువచ్చిన రాతే మన భవిత పుస్తకాన్ని స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్ చేయగానే బోర్డుపై అక్షరాలను రాసే వీడియోలు ప్రత్యక్షమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఉర్దూ డిఐ షేక్.ఎండీ ఖాసిం, క్యాలిగ్రఫీ టీం ఇ.అనిల్‌కుమార్, తొరటి శ్రీనివాసరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రవీంద్రనాద్‌రెడ్డి, ఇతర అధికారులు

విద్యుత్ తీగలు తగిలి వరిగడ్డి లారీ దగ్ధం

ప్రజాశక్తి - రెంటచింతల : వరిగడ్డి లోడ్ తో వెళ్తున్న లారీ మండల కేంద్రమైన రెంటచింతలలోనే బ్రహ్మయ్య బావి సెంటర్లో సోమవారం దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి ఇంజమూరి రాజు వరి గడ్డిని కొనుగోలు చేసి కల్లకుంట గ్రామానికి మినీలారీలో తరలిస్తున్న సమయంలో విద్యుత్తు తీగలు తగిలి మంటలు వ్యాపించాయి ఇది గమనించిన డ్రైవర్ వాహనాన్ని మెయిన్ రోడ్డు వద్దకు తీసుకెళ్లగా అక్కడకు చేరిన వారంతా నీళ్ళు పోసి మంటలను ఆర్పారు.

రైలు కింద పడి యువకుడు మృతి

ప్రజాశక్తి-మాచర్ల : రైలు కింద పడి యువకుడు మృతి చెందిన సంఘటన మాచర్ల మండలం గన్నవరం గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. మాచర్ల పట్టణానికి చెందిన వడ్డమాను నవీన్(25) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసగా మారిన నవీన్ డ్రైవింగ్ పనికి కూడా పోవటం లేదు. కొద్ది రోజులుగా తాను ఆత్మహత్య చేసుకుంటానంటూ అంటున్నట్లు బంధువులు తెలిపారు. నవీన్ ఆదివారం మధ్యాహ్నం నుండి కనిపించక పోవటంతో సోదరుడు శ్రీకాంత్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రాత్రి ఫిర్యాదు చేశాడు. రైలు కింద పడి ఓ వ్యక్తి మృతిచెందిన విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు శ్రీకాంత్‌కు సమాచారం ఇవ్వటంతో పరిశీలించి నవీన్ మృతదేహంగా గుర్తించారు. నవీన్‌కు గుంటూరుకు చెందిన శ్రావణితో మూడేళ్ళ కిందట వివాహం జరిగింది. పిల్లలు లేరు. రాత్రి సమయానికి గుంటూరు నుండి మాచర్ల వచ్చే ప్యాసింజర్ రైలు కింద పడి గన్నవరం గ్రామ సమీపంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి పట్టణంలోని కొత్తపేటలో ఓ ఇంట్లో మహిళ అనుమానాస్పద స్థితిలో సోమవారం మృతి చెందింది. గతంలో మెడికల్ షాప్ నిర్వహించే మాధవి (34) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతి చెందింది. చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లుగా తెలిపారు.



లెప్రసీ రహిత సమాజం కోసం కృషి చేయాలి

సర్వేలను పరిశీలించిన మలేరియా అధికారి మురళీకృష్ణ

ప్రజాశక్తి-తెనాలి : పట్టణంలో వివిధ ప్రాంతాలలో లెప్రసీపై జరుగుతున్న సర్వేలను జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం సోమవారం తనిఖీ చేశారు. నాజర్ పేట ,ఎన్ వి ఆర్ కాలనీ, పినపాడు, సుల్తానాబాద్ లో జరుగు తున్న లెప్రసీ సర్వేలను పరిశీలించి తగు సూచనలు చేశారు. సర్వే జరుగుతున్న విధానము, అనుమానా స్పద కేసులను పరిశీలించే విధానాన్ని సిబ్బందికి వివరించారు. సర్వేని సక్రమముగా నూటికి నూరు శాతం నిర్వహించి లెప్రసీ రహిత సమాజం కొరకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి, సబ్ యూనిట్ అధి కారులు వంగల పున్నారెడ్డి, అందె బాలచంద్ర మౌళి, శ్రీకంఠ ఉమాకాంత్, ఎస్ శివగణేష్, డి శ్రీనివాసరావు, డి నాగమల్లేశ్వరరావు, బి మల్లేశ్వరరావు, వార్డ్ హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.

బీసీల సమస్యలపై 9న భారీ ర్యాలీ : కేశన

ప్రజాశక్తి-గుంటూరు

కులగణన చేపట్టాలని, మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, బిసి చట్టం అమలు చేయాలని తదితర డిమాండ్లపై ఫిబ్రవరి 9న గుంటూరులో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు తెలిపారు. సోమవారం చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోరంట్ల వద్ద బిపి మండల్ విగ్రహం నుండి హిందూ కాలేజ్ వద్ద జ్యోతిరావు పూలే విగ్రహం వరకూ ర్యాలీ ఉంటుందని తెలిపారు. దేశంలో ఇప్పటిదాకా పాలించిన ప్రభుత్వాలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కులగణన చేపడతామని హామీలు ఇస్తూ అధికారంలోకి రాగానే విస్మరిస్తున్నారన్నారు. ఓబిసిగా చెప్పుకునే మోడీ కూడా ఓబిసిల సమస్యలను పట్టించుకోకపోవటం బాధాకరం అన్నారు. జాతీయ స్థాయిలో అన్ని పార్టీలను కలిశామని, వారంతా కులగణనకు ఒప్పుకున్నారని, కానీ మోడీ ప్రభుత్వం మాత్రం అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవట్లేదన్నారు. రాష్ట్రంలోనూ ఎన్నిల్లో చంద్రబాబు నాయుడు బిసిలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. సామాజిక రక్షణ చట్టం, కులగణన చేయాలని, చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ చేపట్టాలని కోరారు. కులగణన చేయని ఎడల తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. మాట్లాడుతూ భవిష్యత్‌లో అన్ని జిల్లాల్లో ర్యాలీలు చేపడతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, బిసి సంక్షేమ సంఘం యువజన విభాగం అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లె ఈశ్వరరావు, రాష్ట్ర కోఆర్డినేటర్ బ్రహ్మానంద శర్మ, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కోలా అశోక్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు కేశన శంకరరావు తదితరులు

31న విజ్ఞాన్‌లో బాలల మహోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

విజ్ఞాన్స్ యూనివర్సిటీలో చిన్నారుల కోసం మొట్టమొదటి సారిగా జనవరి 31 నుంచి రెండ్రోజులపాటు నిర్వహించే రాష్ట్రస్థాయి బాలమహోత్సవ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్‌చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు పిలుపునిచ్చారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో సోమవారం బాలమహోత్సవ్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ 6వ తరగతి నుండి 10వ తరగతి లోపు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్ విద్యార్థులు ఈవేడుకలో పాల్గొనవచ్చని తెలియజేసారు. www.vignan. ac.in/ balamahotsav వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9030557363, 9493033592 నంబర్లను సంప్రదించాలని కోరారు. 50కు పైగా ఈవెంట్లను నిర్వహించబోతున్నామని, విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

రాజధాని గ్రామాల్లో దొంగల హల్‌చల్

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో దొంగలు హల్ చల్ చేశారు. మండలంలోని దొండపాడు, బోరుపాలెం, రాయపూడి గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి దొంగతనాలకు పాల్పడ్డారు. గంజాయి బ్యాచ్ కారణమని స్థానికులు అనుమానిస్తున్నారు. దొండపాడులో వైసిపి ప్రభుత్వంలో సొసైటీ అధ్యక్షులుగా పనిచేసిన కొమ్మినేని అప్పారావు ఇంటిలో దేవతా విగ్రహాలకు అలంకరించిన బంగారం, వెండి తొడుగు పూత కలిగిన నగలను దొంగలు ఎత్తుకెళ్లారు. గదిలో బట్టలు, ఇతర సామగ్రిని చిందరవందర చేశారు. రహదారి పక్కన ఉన్న చిల్లర దుకాణంను, బోరుపాలెంలో మరో నాలుగు బడ్డీ కొట్లలో దొంగతనం కు యత్నించారు. బడ్డీ కొట్లు తాళాలు పగలగొడుతుండగా శబ్దాలకు స్థానికులు నిద్రలేచి వీధుల్లోకి వస్తుండడంతో దొంగలు గమనించి పలాయనం చిత్తగించారు. రాయపూడి లోనూ రోడ్డు పక్కన ఉన్న బడ్డీ కొట్టును పగులగొట్టారు. ఈ సంఘటనలపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగతనాలకు పాల్పడినవారు ఒక కారు, ద్విచక్రవాహనంపై వచ్చారని, ఎంతమంది ఉన్నారనేది తెలియలేదని, గతంలో గంజాయి బ్యాచ్ ఇదే తరహాలో దొంగతనాలకు పాల్పడ్డారని స్థానికులు చెబుతున్నారు. ఈ సందర్భంగా సీఐ గంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతు కొంతమంది ఫిర్యాదు చేశారని విచారణ చేస్తున్నామని చెప్పారు.



పోటీల నిర్వహణకు సిద్ధం చేసిన మైదానం

నేటి నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఎడ్ల పందేలు

ప్రజాశక్తి - రెంటచింతల

కానుక మాత చర్చి 175 ఏళ్ల వేడుకలను పురస్కరించుకొని మండల కేంద్రమైన రెంటచింతలలో సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నుండి వారంపాటు రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఎడ్ల పోటీలను నిర్వహించనున్నారు. ఆరు విభాగాల్లో పోటీలు ఉంటాయని, ఒక్కో విభాగానికి తొమ్మిది బహుమతులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. పోటీల నిర్వహణ కోసం 300 అడుగుల పొడవు, 50 అడుగుల వెడల్పు ఉండేలా మైదానాన్ని సిద్ధం చేశారు. కొన్ని ఎడ్ల జతలకు 10 నిమిషాల పాటు సమయం, మరికొన్ని ఎడ్ల జతలకు 15, 20 నిమిషాల సమయం కేటాయిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే ఎడ్ల జతల వారు ముళ్ల కర్రలు వాడకూడదని, ఎడ్ల తోకలు విరవరాదని, ఒక్కో జతకు ఏడుగురు మించి ఉండకూడదని తెలిపారు. పోటీల్లో వివిధ విభాగాల్లో విజేతలగా నిలిచే ఎడ్ల జతలకు మొత్తంగా రూ.16 లక్షల బహుమతులు ప్రదానం చేస్తామని, పోటీలను మంగళవారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు.

పతాకావిష్కరణ చేయని కార్యదర్శులకు షోకాజులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గణతంత్ర దినోత్సవం రోజున నూజెండ్ల మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో జాతీయ పతాకాలు ఆవిష్కరించదనే అంశంపై నలుగురు పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్‌రెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. దీంతో 48 గంటల్లోగా వివరణివ్వాలని నూజెండ్ల, చింతలచెరువు, ఐనవోలు, ముప్పరాజుపాలెం గ్రామ సచివాలయాల పంచాయతీ సెక్రటరీలకు డిపిఒ షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

సర్వేలను సకాలంలో పూర్తి చేయించండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది క్షేత్ర స్థాయిలో నిర్వహించే సర్వేలను రెండురోజుల్లోగా పూర్తి చేయించాలని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం నరసరావుపేట కలెక్టరేట్‌లో సమీక్షించారు. జియో ట్యాగింగ్, ఎన్పీసీఐ , పీఏసీఎస్ లబ్ధిదారులు, నాన్ రెసిడెంట్ ఏపీ సిటిజెన్స్, సామూహిక ఆస్తులు, ఎమ్మెస్ఎంఇ వంటి సర్వేలను వెంటనే పూర్తి చేయాలన్నారు. రేపట్లోగా జిల్లాలో దాదాపు 20 వేల మంది శిశువుల ఆధార్ వివరాలను పోషన్ ట్రాకర్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. మిగిలిన 30 వేల వరకూ శిశువులకు క్యాంపు ద్వారా ఆధార్ అందించాలన్నారు. నూతన ఇసుక విధానం ప్రకారం ట్రాక్టర్ల ద్వారా జరుగుతున్న ఇసుక రవాణా వివరాలను నమోదు చేయాలని, ఫిబ్రవరి 10 నాటికి జిల్లాలోని అన్ని చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని చెప్పారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు ఆలస్యం చేయకుండా బిల్లులు చెల్లించాలని, ఇప్పటికే లబ్ధిదారులు నివాసం ఉంటున్న ఇళ్ల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు.



23 ఏళ్ల నుండి పని చేస్తున్నా తొలగించారు..





ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు వచ్చే ప్రతి ఫిర్యాదూ పరిష్కారం కావాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుండి 32 వినతులను కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ సూరజ్, డిఆర్ఒ కె.మధులత, జిల్లా అధికారులు స్వీకరించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వినతి

23 ఏళ్లుగా పని చేస్తున్న తమను విధుల నుండి అర్ధాంతరంగా తొలగించారని శావల్యాపురం మండలం వైకల్లు, మతుకుమల్లి గ్రామాలకు చెందిన మధ్యాహ్న భోజన కార్మికులు కొర్రపాటి సుబ్బాయమ్మ, మందా చినజేజమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి మాట్లాడుతూ 2002 నుండి మధ్యాహ్నం భోజన కార్మికురాలుగా పనిచేస్తున్నారని, నాడు గ్రామంలో ఎవరూ ముందుకు రాని నేపథ్యంలో డ్వాక్రా గ్రూపులో లీడర్‌గా ఉన్న మహిళలను వంట చేయాలని గ్రామస్తులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించారని గుర్తు చేశారు. ప్రస్తుతం టిడిపి అనుకూల వ్యక్తులను తల్లిదండ్రుల కమిటీ ఏర్పాటు చేసుకొని గతేడాది ఆగస్టు నుండి విధుల నుండి తొలగించినట్లు తెలిపారు. అధికారులు జోక్యం చేసుకుని బాధితులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

అడంగల్ సవరణ కోసం మూణ్ణెల్లుగా



క్రోసూరు మండల పరిధిలో వారసత్వంగా సంక్రమించిన పొలానికి సంబంధించి అన్నీ సవ్యంగా ఉన్నా అడంగల్ లో చిన్న సవరణకు రెవెన్యూ అధికారులు నెలల తరబడి తిప్పుతున్నారని గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన డి.బాలస్వామి ఫిర్యాదు చేశారు. భూమిపై వివాదాలేమీ లేవని, వెబ్‌ల్యాండ్ కూడా నమోదైందని చెప్పారు. 2017 నాటి సర్వే సర్టిఫికేట్ ఉన్నప్పటికీ ఆ సర్వే రిపోర్ట్ పనికిరాదంటూ అధికారులు ఉద్దేశపూర్వకంగా 3 నెలల నుండి ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

బ్యాంకుకు తాళం వేసి వంటావార్పు

దొడ్లేరులో సిజిజిబి బాధితులు మరోసారి ఆందోళన - వారంలో నగదు జమకు హామీతో విరమణ

ప్రజాశక్తి - క్రోసూరు



బాధితులతో చర్చిస్తున్న పోలీసులు

తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని దొడ్లేరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ గోల్డ్‌లోన్ బాధితులు మరోసారి ఆందోళనకు పూనుకున్నారు. 120కి పైగా బాధితులు సోమవారం బ్యాంకు గేటుకు తాళం వేసి వంటావార్పుతో నిరసన చేపట్టారు. రెండేళ్ల క్రితం బ్యాంకులోని అప్రైజర్ అవినీతి కారణంగా బాధితులంతా బంగారాన్ని కోల్పోయారు. అప్పటి నుండి వీరు బహుముఖ రూపాల్లో ఆందోళనలు చేయడంతోపాటు అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడం, చర్చించడం వంటివి చేశారు. ఫలితంగా 500 మందికి పైగా బాధితులలో 320 మందికి బ్యాంక్ అధికారులు డబ్బులు జమ చేశారు. మిగతవారికీ న్యాయం చేయాలని కోరుతూ తాజాగా ఆందోళన చేపట్టారు. బ్యాంకు అధికారులను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. రెండేళ్లుగా న్యాయం కోసం పోరాడుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఐ సురేష్, ఎస్ఐ నాగేంద్రరావు అక్కడికి చేరుకున్నారు. బాధితులు, బ్యాంకు అధికారులతో చర్చించారు. బాధితులకు వారం రోజుల్లో నగదు జమకు అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన ముగిసింది.



బాలికల హాస్టల్‌లో కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ప్రభుత్వ వసతి గృహంలోని బాలికలకు నాణ్యమైన భోజనం తయారు చేయాలని, మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు స్పష్టం చేశారు. నరసరావుపేట పట్టణంలో మొదటి రైల్వే గేటు వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి మెనూ అమలు, ఇతర సమస్యలను అడిగారు. 10 తరగతి విద్యార్థినుల నూరుశాతం ఉత్తీర్ణత కోసం 'లక్ష్య సాధన' కార్యక్రమంలో భాగంగా తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను అందించాలని ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థినుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అవసరమైతే అదనపు ఉపాధ్యాయులతో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని చెప్పారు.

పేదల డాక్టర్‌గా చతుర్వేదల సీతారామశాస్త్రి బహుముఖ సేవలు

55వ వర్ధంతి కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య

ప్రజాశక్తి - సత్తెనపల్లి



సీతారామశాస్త్రి విగ్రహం వద్ద మాట్లాడుతున్న గద్దె చలమయ్య

సత్తెనపల్లి మాజీ సర్పంచ్, వామపక్షవాది, అభ్యుదయవాది, పేదల డాక్టర్‌గా గుర్తింపు పొందిన చతుర్వేదల సీతారామశాస్త్రి పేదల మన్ననలను పొందారని సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య అన్నారు. సోమవారం సీతారామశాస్త్రి 55వ వర్ధంతి సందర్భంగా స్థానిక తాలూకా సెంటర్లోని ఆయన విగ్రహానికి సిపిఐ, సిపిఎం, టిడిపి, కాంగ్రెస్ పార్టీ, ప్రజా సంఘ నాయకులు, ఆయన కుటుంబ సభ్యులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చలమయ్య మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం కాలంలో సాయుధులకు అచ్చంపేట పోలీస్ స్టేషన్ నుండి ఆయుధాలను సమకూర్చి వారికి అందించే కార్యక్రమంలో చురుకైన పాత్రను పోషించారని అన్నారు. భారత స్వాతంత్రానికి పూర్వం ఆహార ధాన్యాలు నిల్వ ఉంచిన బ్లాక్ మార్కెట్‌ను ఎదుర్కొని పేదలకు ఆహార ధాన్యాలను అందుబాటులోకి తేవడంలో కృషి చేశారని చెప్పారు. కలరా వచ్చినప్పుడు ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లి వైద్యం చేసి ప్రజల ప్రాణాలను కాపాడారన్నారు. అనంతరం మాతృశ్రీ మొల్లమాంబ వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు. అన్నా క్యాంటీన్లో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆర్.శేషయ్య ఎన్.తాండవకృష్ణ. ఎఐటియుసి నియోజకవర్గ అధ్యక్షులు కె.శ్రీనివాస్, టిడిపి నాయకులు ఎస్.పెదకరిముల్లా, మస్తాన్‌వలి, దూదికే, సిపిఎం నాయకులు దుర్గారావు, విమల, బాలకృష్ణ, రాజ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు షేక్ చాన్‌బాషా, న్యాయవాదులు బి.నరసింహారావు, ఆర్.శివనాగేశ్వరరావు, మల్లికార్జునరావు, జానీ ఖాజా ఆలీ, కుటుంబ సభ్యులు అంబిక, దమయంతి, సాంబ, కైలాస్ పాల్గొన్నారు. అనంతరం ప్రజలకు అల్పాహారం అందించారు.

ఖోఖో రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి - నకరికల్లు



బాపట్ల జిల్లా జె.పంగులూరులో 7, 8, 9 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పురుషులు, మహిళల ఖోఖో పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి గుంటూరు జిల్లా జట్లను స్థానిక జెడ్‌పి పాఠశాలలో ఎంపిక చేసినట్లు ఖోఖో అసోసియేషన్ సెక్రటరీ చింతా పుల్లయ్య సోమవారం తెలిపారు. ఎంపికైన జట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంతర్ జిల్లాల సీనియర్ ఖోఖో ఛాంపియన్ షిప్‌లో పాల్గొంటారన్నారు. ఎంపికలను గుంటూరు జిల్లా సీఈఓ డి.కోటేశ్వరావు, అధ్యక్షులు వి.భద్రారెడ్డి, ట్రెజరర్ జి.ఝాన్సీ రాణి, జానకి రామయ్య, పాఠశాల హెచ్‌ఎం కె.నగేష్, విద్యా కమిటీ చైర్మన్ కె.మల్లికార్జున, పిఇటిలు పి.వెంకయ్య, వీరయ్య, పి.బాలకృష్ణ, వీరాంజనేయులు వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

మహిళా నేత సరస్వతి ఆశయాలను కొనసాగించాలి

సంస్మరణ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

తాడేపల్లి ప్రాంతంలో సరస్వతి మహిళా ఉద్యమంలో కీలక పాత్ర వహించారని ఏ ఆశయ సాధన కోసం అయితే సరస్వతి పని చేసిందో, అదే స్ఫూర్తితో ప్రతి కార్యకర్త పని చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం రాత్రి తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్ నగర్‌లో మహిళా సంఘం నాయకురాలు బూరుగ సరస్వతి సంస్మరణ సభ సిపిఎం పట్టణ నాయకులు వేముల దుర్గారావు అధ్యక్షతన జరిగింది. ముందుగా సరస్వతి చిత్రపటానికి పలువురు సిపిఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళా సంఘం నాయకురాలుగా బూరగా సరస్వతి తో పాటు కుటుంబం యావత్తు పార్టీలో పనిచేస్తూ, ఈ ప్రాంతంలో పార్టీకి వెన్నుదన్నుగా నిలిచారని ఆయన అన్నారు. ఆమె నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పని చేసిన మహిళా నాయకురాలని ఆయన అన్నారు. ఆమె ఆశయ సాధనకు తూట్లు పొడిచే విధంగా నేడు కేంద్రంలో బిజెపి పరిపాలన సాగిస్తుందని ఆయన విమర్శించారు. రైతాంగ, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలకు, వ్యతిరేకంగా పనిచేయడమే సరస్వతికి ఇచ్చే సరైన నివాళి అని అన్నారు. ఫిబ్రవరి 1,2, 3 తేదీలలో నెల్లూరులో జరిగే సిపిఎం రాష్ట్ర మహాసభలో జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబురావు మాట్లాడుతూ కార్పొరేట్ రాజధాని కాకుండా, ప్రజా రాజధానిగా రాజధానిని నిర్మించాలని అన్నారు. రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు న్యాయం జరిగే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించాలని అన్నారు. ఎంబివికె కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేయాలని కేంద్రంలో పరిపాలన చేస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్ ఎజెండాగా పెట్టుకొని దేశాన్ని సర్వనాశనం చేస్తున్నారని అన్నారు. భారత రాజ్యాంగాన్ని నిర్మించిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను పార్లమెంటు సాక్షిగా బిజెపి ఎంపీ అమిత్ షా అవమానించటం రాజ్యాంగం పట్ల, ప్రజాస్వామ్యం పట్ల బిజెపి వైఖరికి నిదర్శనంగా మారిందని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగ వెంకటేశ్వరరావు, సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, దొంతి రెడ్డి వెంకటరెడ్డి, సిపిఎం పట్టణ నాయకులు కొట్టే కరుణాకర రావు, బొందలపాటి ప్రభాకరరావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు ఏ జగన్, కోట బాబురావు, వి శాస్త్రి, బొబ్బిలి రామారావు, కే మేరీ, ఎన్ తులసమ్మ, సిహెచ్ సుశీల, బి నవనీతం తదితరులు పాల్గొన్నారు.



సరస్వతి సంస్మరణ సభలో ప్రసంగిస్తున్న వి శ్రీనివాసరావు

బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షల ఫీజు తేదీల మార్పు

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో బిఈడి కోర్సు మొదటి సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి ఫీజును అభ్యర్థులు ఫిబ్రవరి 5వ లోగా చెల్లించుకోవచ్చునని సిఇ ఎ శివప్రసాదరావు తెలిపారు. రూ.100 అపరాధంతో ఫిబ్రవరి 6వ తేదీలోగా చెల్లించ వచ్చునని, థియరీ పరీక్షలు ఫిబ్రవరి 18వ తేదీ నుంచి నిర్వహిస్తామని వెల్లడించారు వివరాలకు యూనివర్సిటీ వెబ్ సైట్ (www.anu.ac.in) ను సంప్రదించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వై నేతాజి

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వాలు మారినప్పుడల్లా పంచాయతీ వర్కర్లకు పని భద్రత లేకుండా పోతుందని యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వై నేతాజీ అన్నారు. సోమవారం ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా విస్తృత సమావేశం పాత గుంటూరు సిఐటియు కార్యాలయంలో ఎం.రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. వై.నేతాజీ మాట్లాడుతూ ఇప్పటికే చేబ్రోలు గ్రామపంచాయతీలో 12 మంది కార్మికుల్ని స్థానిక ప్రజా ప్రతినిధులు, రాజకీయ కారణాలతో అక్రమంగా తొలగించారని అన్నారు. మార్చి 31 నాటికి పూర్తి కావాల్సిన టెండర్ ప్రక్రియ ఇప్పటికీ పూర్తి కాలేదని, దీంతో టెండర్ కార్మికులు వేతనాలు పెంచుకునే అవకాశం కోల్పోతున్నారని, చాలా పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్లకు ఇప్పటికీ రూ.6వేలే జీతం ఇస్తున్నారన్నారు. చెప్పులు, కొబ్బరి నూనె, సబ్బులు, యూనిఫామ్ సంవత్సరాలు తరబడి పెండింగ్లో ఉన్నాయని అన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి పంచాయతీ కార్మికులు అంతా ఐక్యమై పోరాటం చేయడం తప్ప మరో మార్గం లేదని అన్నారు. మార్చి నెలలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి, కార్మిక వర్గ పక్షపాతి అయిన కెఎస్.లక్ష్మణరావును గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు ఎస్.సంగమేశ్వరరావు, ఎస్.లక్ష్మి, కె.నాగరత్నం, సిహెచ్.శివశంకర్, కె.సంధ్య తదితరులు పాల్గొన్నారు



పసుపు రైతుల సమస్యపై వినతి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

దేవాదాయ, ధర్మాదాయ కౌలు రైతులకు సిసిఆర్ కార్డులు మంజూరు చేయనందున ప్రభుత్వ బ్యాంకు రుణాలు దూరమవుతున్నాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబి రెడ్డి అన్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో దుగ్గిరాల అగ్ని ప్రమాద బాధిత పసుపు రైతుల సమస్యపై సబ్ కలెక్టర్ వి సంజనాసింహ కు వినతి పత్రం అందజేశారు. పసుపు రైతులు, అధికారులు గిడ్డంగి యజమానితో సమావేశం ఏర్పాటు చేస్తానని సబ్ కలెక్టర్ సంజనా సింహ హామీ ఇచ్చారని తెలిపారు. దేవాదాయ, ధర్మాదాయ కౌలు రైతులకు సిసిఆర్సి కార్డులు ఇవ్వకపోవడం కారణంగా బ్యాంకు రుణాలు, ప్రభుత్వం ఇచ్చే పరిహారం, సబ్సిడీలు దక్కక నష్టపోతున్నారని తెలిపారు. గుడివాడ దళిత వాడలకు సంబంధించి స్మశానవాటిక స్థలం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని సబ్‌కలెక్టర్ పేర్కొన్నారు. సంఘం జాగర్ల మూడి, అంగలకుదురు మధ్య అలాగే తెనాలి మంగళగిరి, గుంటూరు హనుమాన్ పాలెం రహదారుల్లో గుంతల కారణంగా వందలాది మంది ప్రయాణికులు ప్రమాదానికి గురవుతున్నారని అన్నారు. సత్వరమే గుంతలు పూడ్చేందుకు కృషి చేయాలని, కొల్లిపర మండ లం చివలూరు గ్రామంలో చేతిపంపులు ఏర్పాటు చేయాలని కోరారు. సంఘం నాయకులు ములకా శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికులకు

పెండింగ్ జీతాలు చెల్లించాలని నిరసన

ప్రజాశక్తి - తుళ్లూరు

ప్రభుత్వాలు మారినా కార్మికుల కష్టాలు తీరడంలేదని సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ, సచివాలయంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ సోమవారం అసెంబ్లీ దగ్గర నుండి మందడం సెంటర్ వరకు నిరసన ప్రదర్శన జరిపారు. ఈ సందర్భంగా భాగ్యరాజు మాట్లాడుతూ, అసెంబ్లీ, సచివాల యంలో పనిచేస్తున్న కార్మికులకు డిసెంబర్ నెల జీతం ఇప్పటికీ చెల్లించలేదని, మరో రెండు రోజులు గడిస్తే రెండు నెలలు పూర్తి అవుతుందని అన్నారు. నెలల తరబడి జీతాలు చెల్లించకపోతే కార్మికుల కుటుంబాలు ఏ విధంగా గడుస్తాయని ప్రశ్నించారు. ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు చేస్తే తప్పా జీతాలు చెల్లించారా.. అని నిలదీశారు. 2019లో కార్మికులకు జీతాలు పెంచడం జరిగిందని, ఆరు సంవత్సరాల కాలంలో నిత్యవసర వస్తువుల రేట్లు విపరీతంగా పెరిగాయని, కార్మికుల జీతాలు మాత్రం ఆ మేరకు పెరగలేదని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని అన్నారు. కాంట్రాక్టర్ మారినప్పుడల్లా కార్మికులు అనేక ఇబ్బందులు గురికావలసి వస్తోందని, కొన్ని సందర్భాల్లో కాంట్రాక్టర్లు జీతాలు, పిఎఫ్,ఈఎస్ఐలు చెల్లించకుండా వెళ్లిపోతుండడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందన్నారు. జీతాల కోసం ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు చేపట్టవలసిన అగత్యం కలుగుతోందని అన్నారు. కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసి ప్రభుత్వం ఆధీనంలోకి కార్మికులను తీసుకొని వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. గతంలో 185 మంది కార్మికులు ఉండగా, ప్రస్తుతం 154 మంది మాత్రమే పనిచేస్తున్నారని, దీంతో కార్మికులపై పని భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల నియామకం గురించి గత ప్రభుత్వ, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మంత్రులకు అనేక సార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోలేదని అసంతప్తి వెలిబుచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరిం చాలని భాగ్యరాజు డిమాండ్ చేశారు.



మందడంలో నిరసన తెలుపుతున్న కార్మికులు



మాట్లాడుతున్న ముత్యాలరావు

పెండింగ్ క్లెయిమ్స్ విడుదల చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో పెండింగ్‌లో ఉన్న ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ క్లెయిమ్స్ విడుదల చేయాలని సిఐటియు గుంటూరు నగర పశ్చిమ కమిటీ ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు డిమాండ్ చేశారు. సోమవారం గుజ్జనగుళ్ళలోని సిఐటియు కార్యాలయంలో ఎలక్ట్రీషియన్ డే సందర్భంగా జండా ఆవిష్కరణ, జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. గుంటూరు నగర ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బి.సీతారామయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముత్యాలరావు మాట్లాడితూ ఎలక్ట్రికల్ వర్కర్స్ ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారం కోసం కషి చేయాలని పిలుపునిచ్చారు. గత 10 సంవత్సరాలుగా సంక్షేమ బోర్డు నిధులు ఇతర అవసరాలకు మళ్లించటం వల్ల కార్మికుల క్లెయిమ్స్ పెద్ద ఎత్తున పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తక్షణమే క్లెయిమ్స్ విడుదల చేయాలని, కొత్త పథకాలు పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ కార్యదర్శి సుభాష్ చంద్రబోస్, సిఐటియు నగర పశ్చిమ కమిటీ అధ్యక్షుడు బి.సత్యనారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం నగర ప్రధాన కార్యదర్శి షేక్.ఖాసింవలి, ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మోహనరావు, ఆర్.రాము, రాజేంద్రప్రసాద్, సాంబశివరావు, సీపాన పద్మనాభుడు, టి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాల్లో ఇళ్లు తొలగించిన బాధితులకు న్యాయం చేయాలి

ఇళ్ల స్థలం కేటాయించి, ఇళ్లు నిర్మించాలని సచివాలయాల్లో వినతి

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

2016 కృష్ణా పుష్కరాల్లో ఇళ్లు తొలగించిన వారికి రెండు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి, గృహ నిర్మాణ పథకం ద్వారా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, సిపిఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం తాడేపల్లి పట్టణ కమిటీ పిలుపులో బాగంగా పట్టణంలోని సుందరయ్య నగర్, రామయ్య కాలనీ, కృష్ణానగర్ సచివాలయం, ఉండవల్లి, కొత్తూరు తదితర ప్రాంతాల సచివాలయాల వద్ద సిపిఎం శ్రేణులు కనీస మౌలిక వసతులు కల్పించాలని, స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సచివాలయాలలో వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు కావస్తున్న తాడేపల్లి పట్టణ పేదలకు లోకేష్ ఇచ్చిన హామీని అమలు చేయ లేదని విమర్శించారు. ఆనాడు పాదయాత్ర చేస్తున్న లోకేష్ తాడేపల్లి పట్టణ ప్రాంతంలో ఇళ్లు లేని పేద లందరికీ ఇంటి స్థలంతో పాటు, ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. అదే విధంగా 2016 కృష్ణా పుష్కరాల సందర్భంగా సీతానగరం, మహానాడు తదితర ప్రాంతాలలో ఇళ్లు తొలగించిన పేదలకు ఇప్పటికీ ఇంటి స్థలం కానీ, ఇంటి నిర్మాణాలు చేపట్టలేదని ఆయన అన్నారు. తక్షణమే వారికి రెండు సెంట్లు చొప్పున ఇంటి స్థలం మంజూరు చేసి, గృహ నిర్మాణ పథకం ద్వారా ఇంటి నిర్మాణం చేపట్టి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా ఫారెస్ట్ ప్రాంతంలో రోడ్లు, మౌలిక వసతులు కల్పించాలన్నారు. పశువుల ఆసుపత్రి వద్ద శిధిలావస్థలో బ్రిడ్జి ఉందని, కొత్తగా బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టి పట్టణ ప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. సచివాలయాల వద్ద అర్జీలు ఇచ్చిన వారిలో సిపిఎం నాయకులు కొట్టే కరుణాకర రావు, పి గిరిజ, సుధా, పి రామచంద్రరావు, బొబ్బిలి రామారావు, ఎం శ్రీనివాసరెడ్డి, వి దుర్గారావు, కె మేరీ, శాస్త్రి, బి ప్రభాకర్, ఎం.మల్లేశ్వరి, నీరుడు దుర్గారావు, ఎస్కే ఇర్ఫాన్, వేముల వెంకన్న, కాళిదాసు, రాము పాల్గొన్నారు.





సచివాలయ అధికారులకు వినతి పత్రాలిస్తున్న నాయకులు

పేదలకు సేవ చేయడంలోనే తృప్తి

ప్రభుత్వ చీఫ్ విప్ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

తమ కుటుంబ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ సేవలు రూ.వందల కోట్లకు విస్తరించాలన్నదే తన జీవితాశయమని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. తద్వారా పేదలకు, అవసరంలో ఉన్నవారికి మరింత సేవ చేసే అవకాశం తనకు కలుగుతుందని చెప్పారు. వినుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 1,218 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 608మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరంగా గుర్తించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ లీలావతి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు. శిబిరానికి వచ్చిన వారందరికీ భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. అనంతరం చీఫ్ విప్ జీవీ మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలా ఉచిత వైద్య శిబిరాలతో పాటు ఉద్యోగ మేళాలతో యువతకు అండగా నిలుస్తామన్నారు. ఇక్కడ ఎమ్మెల్యేగా సేవచేయడానికి, ప్రభుత్వ చీఫ్ విప్‌గా అవకాశం ఇచ్చిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. పల్నాడు ప్రాంతంలో ఇంటింటికీ మంచినీటిని అందించడానికి శక్తివంచన లేకుండా కష్టపడతానని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు



నిలబెట్టుకుంటామన్నారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ త్వరలోనే కొత్త పింఛన్లు అందిస్తామన్నారు. భవిష్యత్తులో 50 ఏళ్ల నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కూడా పింఛన్లు అందిస్తామన్నారు. అర్హత కలిగిన వారికి కూడా ప్రభుత్వం ద్వారా ఎన్టీఆర్ కాలనీలు నిర్మించి ఇళ్లు ఇస్తామని చెప్పారు. నదుల అనుసంధానంతో పల్నాడు ప్రాంత ప్రజలు కూడా రెండు పంటలు పండించుకుంటారని తెలిపారు.



సేవలకు గుర్తింపే అవార్డులు

ప్రజాశక్తి- , మాచర్ల, మాచర్ల రూరల్

విధి నిర్వహణలో చేసిన సేవలకు గుర్తింపుగానే అవార్డులు లభిస్తాయని వాసవి క్లబ్ జోన్ ఛైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు అన్నారు. వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో రెంటచింతల ఎంపిడిఓ సరోజినిదేవిని సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెంటచింతల మండలంలో చేసిన సేవలకు గానూ ఎంపిడిఓ సరోజినీ దేవి గణతంత్ర దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణబాబు చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారని చెప్పారు. ఇలా ఎన్నో ఉత్తమ అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫాస్ట్ రీజియన్ ఛైర్మన్ మేడం నాగేశ్వరావు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు భవనాసి రవితేజ, బత్తుల బ్రహ్మం, కోశాధికారి బచ్చు రాజ్ కుమార్, సభ్యులు గంగిశెట్టి రాధాకృష్ణమూర్తి, పందిరి నరసింహారావు, చుండూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వాసవి క్లబ్ జోన్ ఛైర్మన్‌గా ఎన్నికైన చెన్నకేశవరావును ఎంపీడీవో సరోజినిదేవి సన్మానించారు.



పుట్టిన తేదీ లేక ఆధార్ కార్డులకు దూరం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

పుట్టిన తేదీలేని కారణంగా చాలామందికి ఆధార్ కార్డులు రావడం లేదని తహసీల్దార్ బి.కిరణ్‌కుమార్‌కు స్థానిక రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి విన్నవించారు. ఈ మేరకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనేక మంది చిన్న పిల్లలకు, పెద్దలకు పుట్టిన తేదీ లేని కారణంగా ఆధార్ కార్డు ఇవ్వటం లేదన్నారు. ఆధార్ కార్డు లేకపోవటం వల్ల పాఠశాలల్లో అడ్మిషన్లు కూడా పొందలేకపోతున్నారని తెలిపారు. దీనివల్ల చదువుకు దూరమవుతున్నారని చెప్పారు. పెద్దవారు కూడా ప్రభుత్వ పథాకాలకు నోచుకోలేక పోతున్నారని వివరించారు. వివిధ వార్డుల్లో ఆధార్‌కార్డు అందక ఇబ్బంది పడుతున్న వారి జాబితాను తహసీల్దారుకు అందజేశారు. సమస్యను ఉన్నాతాధికారులతో చర్చించి, అటువంటి వారి కోసం ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేసి ఆధార్‌కార్డులు ఇప్పించాలని కోరారు.

తగు జాగ్రత్తలతోనే సురక్షిత ప్రయాణం

ప్రజాశక్తి - దాచేపల్లి

తగు జాగ్రత్తలు తీసుకోవడం, నిబంధనలు పాటించడం వల్లే సురక్షితంగా గమ్యస్థానం చేరుకుంటామని ఎస్సై సౌందర రాజన్ తెలిపారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మండలంలోని గ్రామాలపాడులో ఉన్న సాగర్ సిమెంట్ ఆధ్వర్యంలో ర్యాలీ సాగింది. ముఖ్యఅతిథిగా ఎస్సై మాట్లాడుతూ ప్రయాణాలు చేసే సమయంలో రోడ్డు భద్రత, ప్రభుత్వం నిబంధనలను పట్టించుకుంటూ వెళ్లాలని సూచించారు.



వినుకొండ కమిషనర్‌కు అభినందనలు

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ పురపాలక సంఘం కమిషనర్ ఎం.సుభాష్ చంద్రబోస్‌కు ఉత్తమ కమిషనర్‌గా అవార్డు అందుకోవడంపై పలువురు అభినందనలు తెలియజేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. విధి నిర్వహణలో చేసిన సేవలే ఈ గుర్తింపునిచ్చాయని ఆయనను కార్యాలయ ఉద్యోగులు, ఇతర ప్రముఖులు అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

రైలు హాల్టు పునరుద్ధరణపై హర్షం

ప్రజాశక్తి - దాచేపల్లి

నారాయణాద్రి రైలు తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్లేందుకు మార్గమధ్యంలోని నడికుడి రైల్వే జంక్షన్‌లో నిలుపు చేసేందుకు అనుమతి ఇవ్వడంపై దాచేపల్లి నగర పంచాయతీ కౌన్సిల్ మెంబర్ షేక్ షరీఫ్ సోమవారం కృతజ్ఞతలు తెలిపారు. రైలును నిలిపేందుకు చర్యలు తీసుకున్న నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావులకు కృతజ్ఞతలు తెలియజేశారు. 20 సంవత్సరాలుగా నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్, డెల్టా ఎక్స్‌ప్రెస్ నడికుడి రైల్వే జంక్షన్‌లో ఆగేవి. కరోనా తర్వాత చాలా వరకు బళ్లు ఆగిపోయాయి. గతం మాదిరిగా అన్ని రైలు సర్వీసులనూ పునరుద్ధరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సమన్వయంతో ప్రజాసమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-ఈపూరు

ప్రజా సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయం చేసుకొని సత్వరంగా పరిష్కరించాలని ఎంపీపీ ఈదర రాధిక అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు వారి పరిధిలో జరుగుతున్న పనులను వివరించారు. జడ్పిటిసి సభ్యులు తుర్లపాటి చౌడయ్య మాట్లాడుతూ ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే ప్రజాప్రతినిధుల దృష్టికి తేవాలన్నారు. ముప్పాళ్ళ పశు వైద్యాధికారిని సునీత మాట్లాడుతూ పశువులకు గొంతు వాపు వ్యాక్సిన్, అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పగా.. 'మీరు వైద్యం చేసి ఉచితంగా అందిస్తే పశువుల యజమానులు మందులను బయట ఎందుకు కొనుగోలు చేస్తున్నా'రని ప్రశ్నించారు. తహసీల్దార్ ఎ.నళిని మాట్లాడుతూ మండలంలో కొచ్చర్ల గ్రామాన్ని భూ రీ సర్వే లో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.ప్రభాకరరావు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ముదిరాజులంతా ఐక్యంగా ఉండాలి'

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ముదిరాజులంతా ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని మాజీ మంత్రి విడుదల రజిని సూచించారు. సోమవారం ఆమెను ముదిరాజు సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రజిని మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా గత వైసీపీ ప్రభుత్వం ముదిరాజులకు కార్పొరేషన్ ఛైర్మన్ ఏర్పాటు చేయడమే కాక, వారికి ఆర్థికంగా.. రాజకీయంగా సముచిత స్థానం కల్పించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు కొర్నే నారాయణముదిరాజ్, వైఎస్ఆర్సిపి ముదిరాజ్ సంఘ విభాగం రాష్ట్ర అధ్యక్షులు కోమటి విష్ణువర్ధన్, వెలుగు మద్దిలేటి స్వామి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



లేగదూడల ప్రదర్శన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మండలంలోని మానుకొండువారిపాలెంలో లేగ దూడల ప్రదర్శనను శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 61 లేగ దూడలు పాల్గొనగా.. విజేలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పశువులలో వచ్చే గర్భ కోశ వ్యాధులు, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ, పశువుల పెంపకం, శాస్త్రీయ యాజమాన్యపు పద్ధతులపై ఈ సందర్భంగా పశు పోషకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట టిడిపి మండల అధ్యక్షులు జువాజీ మదనమోహన్, డీడీ డాక్టర్ పి.రామారావు, వైద్యురాలు పి.దీప్తి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- కారంపూడి

గాదెవారిపల్లి గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ మాజీ సర్పంచ్ దోర్నాల బ్రాహ్మరెడ్డి, ఉప సర్పంచ్ నరసింహారెడ్డి, విప్పర్ల ఆంజనేయులు హాజరయ్యారు. పశు వైద్యాధికారి సాల్మన్ సింగ్ పశువులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

ఆటోడ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

రోడ్డు ప్రమాదాల నివారణకు ఆటోడ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలని విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ అన్నారు. సోమవారం సరిహద్దు ప్రాంతమైన నాగార్జున సాగర్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. చోదకులు లైసెన్స్‌లు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు.

'యువగళం పాదయాత్రకు రెండేళ్లు'

ప్రజాశక్తి-పెదకూరపాడు

మంత్రి లోకేష్ యువగళం పాదయాత్రకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా టీడీపీ నాయకులు స్థానిక కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి అర్తిమల్ల రమేష్ ఆధర్యంలో కేకు కోసం పంచిపెట్టారు. యువగళం టీం కోఆర్డినేటర్ ఏటుకూరి సురేష్, మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామ్ గోపాల్ రావు, సీనియర్ నాయకులు మద్దినేని సత్యం, నెల్లూరి మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

జాన్సన్‌కు సేవా పురస్కారం

ప్రజాశక్తి-సత్తెనపల్లి: పట్టణానికి చెందిన మదర్ థెరిస్సా ఆదరణ సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలుకా జాన్సన్‌కు గణతంత్ర వేడుకల సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఈ మేరకు పల్నాడు కలెక్టర్ అరుణ్ బాబు చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు.



విద్యార్థికి మెరుగైన వైద్యసేవలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం అడ్డరోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి, గుంటూరు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి వేమవరపు ఫణీంద్రను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం పరామర్శించారు. మెరుగైన వైద్య సహాయం అందించాలని వైద్యులకు సూచించారు. గురుకుల పాఠశాలల ఉమ్మడి గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ లలపద్మజ, సత్తెనపల్లి ఆర్డీవో జి.రమకాంతరెడ్డి, ప్రిన్సిపాల్ జాన్సన్ తదితరులు విద్యార్థిని పరామర్శించారు.



ప్రజా ప్రయోజనాలే న్యాయవాదుల ధ్యేయం కావాలి

ప్రజాశక్తి - వినుకొండ

అభివృద్ధి, అధికారిక కార్యకలాపాలకు న్యాయపరమైన అడ్డంకులు తలెత్తకుండా, ఎదురైన సమస్యల్ని పరిష్కరించడంలో ప్రభుత్వ న్యాయవాదులు కీలకపాత్ర పోషించాలని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. వారు ఆ బాధ్యతను ఎంత సమర్థంగా నిర్వహిస్తే అంతవేగంగా ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరడానికి వీలు కలుగుతుందని తెలిపారు. వినుకొండ జూనియర్ సివిల్ కోర్టులో అదనపు ప్రభుత్వ న్యాయవాది(ఏజీపీ)గా నియమితులైన ముప్పాళ్ల జ్ఞానేశ్వరావు, వినుకొండ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా నియమితులైన నక్కా రమణారావు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులును సోమవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జ్ఞానేశ్వరరావు, రమణారావును శాలువాలతో సత్కరించి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు సత్రశాలకు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

ప్రజాశక్తి - రెంటచింతల

పల్నాట ప్రముఖ శైవ క్షేత్రం, కృష్ణానది ఒడ్డున ఉన్న సత్రశాలకు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మంగళవారం రానున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు చపారపు అబ్బిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 26న నిర్వహించబోయే మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను గురించి వివిధ శాఖ అధికారులతో చర్చించనున్నారని వివరించారు. ఆలయ ప్రాంగణం చదును చేయడం, మంచినీరు, గజ ఈతగాళ్లు, పార్కింగ్, ఆర్టీసీ బస్సులు, వైద్య ఆరోగ్య శిబిరాలు తదితర ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులతో చర్చించనున్నట్లు పేర్కొన్నారు.


పెచ్చులూడుతున్న గదిలోనే విద్యార్థుల చదువులు

బడికెళ్దామంటే.. భయమవుతోంది!

➢ శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాల
➢ పైపెచ్చులూడిపోతుండటంతో విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి - తుళ్లూరు
మండల విద్యా వనరుల కేంద్రం, ఎంపీడీవో కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను చదుకోవడానికి బడికి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. వారిపి పాఠశాలకు పంపేందుకు తల్లిదండ్రులు కూడా ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. అంతటికీ కారణం శిథిలావస్థలో ఉన్న భవనమే.. స్థానిక అయ్యన్న చెరువు కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరింది. పెచ్చులూడుతున్న పై కప్పులు.. పగుళ్లిచ్చిన గోడలు.. ఎప్పుడు ఏ ప్రమాదం వాటిల్లుతుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనకు గురవుతున్నారు. పాఠశాలలో కేవలం ఒక్క తరగతి గదిలో 33 మంది విద్యార్థులకు హెచ్ఎంతో పాటు మరో ఉపాధ్యాయురాలు విద్యాబోధన చేస్తున్నారు. పై పెచ్చులూడి పిల్లలపై పడతాయేమోనని తల్లిదండ్రులు హడలిపోతున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ కొరవడటం తదితర కారణాల వల్ల శిథిలావస్థకు చేరిన పాఠశాలలోనే పిల్లలు చదువుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. పిల్లల భద్రతకు భరోసా ఎక్కడని నిలదీస్తున్నారు. రాజధాని కారణంగా పాఠశాలల నిర్మాణం సిఆర్‌డిఎ పరిధిలో ఉండడంతో శిథిలావస్థకు చేరినా నాడు - నేడుకు ఎంపిక చేయలేదన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి పాఠశాల బాగోగులు గురించి పట్టించుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు స్థానికులు కోరుతున్నారు.



టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి-చేబ్రోలు
త్వరలో జరగబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని తెనాలి ఉప విద్యాశాఖాధికారి జి.శాంతకుమారి సూచించారు. సోమవారం నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. పదవ తరగతి విద్యార్థుల 100 రోజులు యాక్షన్ ప్లాన్ అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. పరీక్ష సమయంలో పాటించవలసిన ఆరోగ్య సూత్రాలను తెలిపారు. సులువైన బోధనా పద్ధతుల్లో విద్యార్థులకు కనీసం పాస్ మార్కులు వచ్చే విధంగా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. నారాకోడూరు పాఠశాల విద్యార్థిని ఎస్‌కే నజ్మా పాండిచ్చేరిలో జరిగిన నేషనల్ సైన్స్‌ఫేర్‌లో ప్రతిభ చూపడంపై అభినందించారు.

జగనన్న కాలనీల నిర్మాణం.. అవినీతిమయం

➢ ప్రభుత్వం ఎలాంటి చర్యలైనా తీసుకోవచ్చు..
➢ వార్డుల పర్యటనలో రాష్ట్ర మంత్రి మనోహర్

ప్రజాశక్తి-తెనాలి
జగనన్న కాలనీల నిర్మాణంలో తెనాలి నియోజకవర్గంలో మితిమీరిన అవినీతి జరిగిందని.. దీనిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నా అందరూ కట్టుబడాల్సిందేనని రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పురపాలక సంఘ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించేందుకు సోమవారం నుంచి పాదయాత్ర చేపట్టిన ఆయన.. పట్టణంలో 1, 2 వార్డులలో పర్యటించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ రానున్న రోజులలో తెనాలి నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. జగనన్న కాలనీ నిర్మాణంలో తెనాలి నియోజకవర్గంలో అతిపెద్ద కుంభకోణమే జరిగిందని, దీనిపై ప్రభుత్వం తీసుకునే చర్యలకు ఎవరూ అతీతులు కాదన్నారు. ఇప్పటికే విజిలెన్స్ అధికారులకు దీనిపై నివేదిక సమర్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ మాజీ చైర్పర్సన్ నన్నపనేని రాజకుమారి, మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న, తహసీల్దార్ కేవీ గోపాలకష్ణ, టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు అన్నాబత్తుని జయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వార్డు ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్



పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్
ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి గ్రామంలో పశువైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. తాడేపల్లి మండల టిడిపి అధ్యక్షులు సుబ్బారావు పాల్గొని, పాడి రైతులకు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు పోషకుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. శిబిరాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కట్రపాడులో పశువైద్య శిబిరం

పెదనందిపాడు : మండలంలోని కట్రపాడులో సోమవారం పశు వైద్య శిబిరాన్ని వెటర్నరీ డాక్టర్ ఎం.అనిత ఆధ్వర్యంలో నిర్వహించారు. శిబిరంలో 24 దూడలకు నట్టల నివారణ మందు, 18 పశువులకు చూడి పరీక్షలు, అయిదు గేదలకు గర్భకోశ వ్యాధి పరీక్షలు చేశామని ఆమె తెలిపారు. ఇతర చికిత్స పొందిన పశువులు 21 ఉన్నట్లు చెప్పారు. 32 మంది పాడి రైతులకు ప్రభుత్వ పథకాల వల్ల లబ్ధి చేకూరినట్లు వివరించారు. కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది ఎస్.డోరతి, ఎ.క్రాంతి కుమార్, పి.పవన్ కుమార్, బాపయ్య, టి.నవీన్, పాడి రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ఎగ్గొట్టే ఎత్తుగడ : మాజీ మంత్రి అంబటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి
రాష్ట్రంలో పేదలకు ఇవ్వాల్సిన సంక్షేమ పథకాలను ఇవ్వకుండా ఎగ్గొట్టేందుకు సిఎం చంద్రబాబు నాయుడు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారని మాజీ మంత్రి అంబటి రాంబాబు దుయ్యబట్టారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తన వైఫల్యాలను గత ప్రభుత్వంపై చూపుతూ ఇచ్చిన హామీలను ఎలా విస్మరించాలా అనే విషయంపై అధ్యయనం చేస్తున్నారని విమర్శించారు. తాను అధికారంలో ఉంటేనే పెట్టుబడులు వస్తాయని ప్రజలను నమ్మించి గత ప్రభుత్వం అమలు చేసిన అన్ని సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని చెప్పి, కొత్తగా మరికొన్ని పథకాలను ప్రవేశపెడతామని సూపర్ సిక్స్ పేరుతో అనేక హామీలు ఇచ్చి ఇప్పుడు మాట మారుస్తున్నారని విమర్శించారు. దావోస్‌లో రూపాయి కూడా పెట్టుబడులు తేలేక చేతులెత్తేసిన చంద్రబాబు నాయుడు వైసిపి హయంలో ఆర్థిక విధ్వంసం చేశారని అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. నీతి అయోగ్ వెల్లడించిన లెక్కలను చూపుతూ తల్లికి వందనం, రైతు భరోసా,ఉచిత బస్సు, మహిళలకు నెలకు రూ.1500, 50 ఏళ్లకు బిసిలకు ఫించన్లు వంటి పథకాలను ఎగ్గొట్టడానికి కసరత్తు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అప్పులపైనా అబద్దాలు ప్రచారం చేశారని తెలిపారు. అధికారంలోకి అద్భుతాలు చేస్తామని ప్రజలను నమ్మించిన టిడిపి కూటమి 9 నెలల తరువాత కూడా గత ప్రభుత్వంపై నిందలు మోపడానికి సిగ్గులేదా అని ప్రశ్నించారు. 2014-2019లో కూడా టిడిపి హయంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అధ్వానంగా ఉన్నా తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిందన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలను పూర్తిగా అమలు చేశామన్నారు. వైసిపి హయంలో జగన్ ఒక్కసారి దావోస్ వెళ్లకపోతే ఎందుకు వెళ్లలేదని తప్పుడు ప్రచారం చేశారని, ఇప్పుడు చంద్రబాబు తన మందిమార్బలంతో వెళ్లి సాధించింది ఏమీ లేదన్నారు. వైసిపి హయంలో దావోస్‌లో ఒకే ఏడాది రూ.1.26 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు.

యువగళానికి రెండేళ్లు.. టీడీపీ సంబరాలు

ప్రజాశక్తి -తాడేపల్లి రూరల్, మంగళగిరి
విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ చేసిన యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పు తీసుకొచ్చిందని టిడిపి తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు అన్నారు. యువగళం పాదయాత్ర ప్రారంభమై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం తాడేపల్లి పట్టణ టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ ప్రజల కష్టాలు వింటూ, కన్నీళ్లు తుడుస్తూ సాగిన యువగళం పాదయాత్ర ప్రజాచైతన్యంతో సంపూర్ణ విజయం సాధించిందన్నారు. కార్యక్రమంలో టీడీపి తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ తాడిబోయిన భాస్కర్, మాజీ మున్సిపల్ చైర్మన్ కొయ్యగూరు మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



చరిత్రను మార్చిన పాదయాత్ర

రాష్ట్ర రాజకీయ చిత్రపటాన్ని యువగళం పాదయాత్ర మార్చేసిందని గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాస్ అన్నారు. మంగళగిరి టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో ఆ పార్టీ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. కేక్‌కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి,రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు తదితరులు మాట్లాడారు.

పేదలకు చేయూత

ప్రజాశక్తి-మంగళగిరి
వరద సమయంలో జీవనోపాధి కోల్పోయిన మంగళగిరి పట్టణంలోని పేదలకు యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్, పారేపల్లి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తోపుడుబండ్లు, కుట్టుమిషన్లు, చిరు వ్యాపారాలకు సరుకులను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ఇన్చార్జ శ్రీరాములు, పారేపల్లి ఫౌండేషన్ అధినేత పారేపల్లి రామకృష్ణ, విజయలక్ష్మి, పారేపల్లి మహేష్, దుర్గాప్రసాద్, ఉడత శ్రీనివాస్, ప్రసాద్, కాగితాల స్వాతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శబ్ద కాలుష్యానికి పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-మంగళగిరి
మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలందరూ శబ్ద కాలుష్యం లేకుండా నిర్దేశిత ప్రమాణాలు పాటించాలని కమిషనర్ అలీం భాషా సోమవారం ఒక ప్రకటనలో కోరారు. బహిరంగ, ప్రైవేట్ ప్రదేశాల్లో శబ్ద కారకాల వ్యవస్థను పరిమిత పరిణామంలోనే వినియోగించాలని స్పష్టం చేశారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు ఇది వర్తిస్తుందని.. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల్లోపు వాహనాల హారన్ల వాడకం, ధ్వని విడుదల చేయడం, ఫైర్ క్రాకర్లు పేల్చడం వంటి వాటిపై నిషేధం ఉంటుందని పేర్కొన్నారు. నిబంధనలు పాటించని వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.



ఘనంగా వివా పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - పెదకాకాని
మండల పరిధిలోని నంబూరు గ్రామంలో వివా ది స్కూల్ తొమ్మిదో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇండియన్ ఆర్మీ మేజర్ వెంకటేష్ శర్మ, వివా వివిఐటి విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ హాజరయ్యారు. విద్యార్థులకు క్రీడ, సాంస్కృతిక అంశాలలో పోటీలు నిర్వహించి ప్రశంసాపత్రాలను అందించారు. విద్యార్థులు జై జవాన్ జై కిసాన్ అంటూ ప్రదర్శించిన నత్యం, "భువన విజయం" నాటిక ఆకట్టుకున్నాయి. పాఠశాల వార్షిక ప్రణాళికను ప్రిన్సిపల్ చదలవాడ సరళ ప్రకటించారు. వివా డైరెక్టర్ లెఫ్టినెంట్ కమాండర్ కె.ఎస్. రావు, గుంటూరు క్యాంపస్ హెడ్ మామిళ్లపల్లి వేదవాణి, ఐబి ప్రోగ్రాం సంధానర్త కె.మాధవి, సిబిఎస్ఈ సంధానకర్త జ్యోతి మెటిల్డా, సీనియర్ సెకండరీ సంధాకర్త లక్ష్మిభాస్కర్, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఆడపిల్లలను రక్షిద్దాం.. చదివిద్దాం...

ప్రజాశక్తి-పెదనందిపాడు
ఆడపిల్లలను బతకనిద్దాం.. చదివిద్దామని వరగాని సెక్టార్ సూపర్‌వైజర్ వి.అరుణ అన్నారు. భేటీబచావో, భేటీ పడావో కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని పాలపర్రు జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రత, బాలికల చదువు ఆవశ్యకత, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. వివాహ వయస్సు రాకుండా పిల్లలకు పెళ్లి చేయవద్దని.. ఈ విషయంలో విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి కన్నుమూత

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్



మెల్లెంపూడి గ్రామానికి చెందిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి తుమ్మపూడి చంద్రారావు (80) ఆదివారం రాత్రి అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న సిపిఎం తాడేపల్లి సీనియర్ నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, మండల కార్యదర్శి పల్లె కృష్ణ, సీనియర్ నాయకులు కంచర్ల జేమ్స్ చంద్రారావు తదితరులు భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

డాక్టర్ నరేష్‌బాబుకు బెస్ట్ స్పయిన్ క్లినికల్ రీసర్చ్ అవార్డు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రముఖ వెన్నెముక శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ జె.నరేష్‌బాబు ఇండియా స్పయిన్ సర్జన్స్ అసోసియేషన్ (ఎఎస్-ఎస్ఐ) అందజేసే బెస్ట్ స్పైన్ క్లినికల్ రీసర్చ్ అవార్డు-2024ను అందుకున్నారు. గత వారం బెంగళూరులో నిర్వహించిన అసోసియేషన్ వార్షిక సమావేశంలో మెడల్, రూ.25వేల నగదు బహుమతి అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో జరిగిన పరిశోధనకు ఈ ప్రతిష్టాత్మక అవార్డు దక్కడం ఇదే తొలిసారి అని డాక్టర్ నరేష్‌బాబు తెలిపారు. గుంటూరు మల్లికా స్పయిన్ సెంటర్ లో నిర్వహించిన ఈ పరిశోధన సర్వైకల్ స్పాండిలైటిస్ ఎందుకు క్షీణిస్తుంది అనే కారణాలను వెలికితీయడంపై దృష్టి సారించిందన్నారు. సర్వైకల్ స్పాండిలైటిస్, మెడ నరాల ఒత్తిడితో బాధపడుతున్న రోగులలో రోజువారీగా సంభవించే మెడ కదలికలు వ్యాధి పురోగతిపై ఎలాంటి ప్రభావం చూపుతాయనే అంశాన్ని అధ్యయనం చేశామన్నారు. డైనమిక్ ఎంఆర్ఐ సాయంతో కూర్చుని, మెడ కదలికల సమయంలో 50 మంది రోగులను ఈ పరిశోధనలో పరిశీలించామని చెప్పారు. అదేవిధంగా డాక్టర్ నరేష్‌బాబు ఇండియా స్పయిన్ సర్జన్స్ అసోసియేషన్ సెక్రటరీగా ఎన్నికయ్యారు.


అవార్డు అందుకుంటున్న డాక్టర్ నరేష్‌బాబు

ఆర్‌విఆర్‌లో ముగిసిన ఎఐసిటిఇ శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

విద్యారంగంలో వస్తున్న మార్పులకు అను గుణంగా ఆధునిక బోధనా విధానాన్ని అనుసరించే ందుకు ఎఫ్‌డిపి శిక్షణా తరగతులు అధ్యాపకులకు సహాయపడతాయని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలెజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి ముర ళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని పేర్కొన్నారు. ఎఐసిటిఇ అటల్ సహకారంతో కళాశాలలో ఇంట్రడక్షన్ టు జనరేటివ్ ఎఐ మోడల్స్ అండ్ అప్లికేషన్స్ అనే అంశంపై ఆరు రోజులపాటు నిర్వహించిన శిక్షణ సోమవారం ముగిసింది. ఎఐసిటిఇ తమ కళాశాల ద్వారా శిక్షణ నిర్వహించటంతోపాటు, నిధులు కూడా మంజూరు చేయటం గర్వకారణం అని కళాశాల సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్లు , వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాసరావు


మాట్లాడుతున్న పాశం రామారావు

మంత్రి లోకేష్ ఎన్నికల హామీని అమలు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కూటమి ప్రభుత్వం ఏర్పడక ముందు మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్ ఇళ్ల స్థలాలపై, ఇళ్ల పట్టాలపై ఇచ్చిన హామీని అమలు చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మేక అమరారెడ్డి భవన్‌లో సిపిఎం తాడేపల్లి రూరల్ కమిటీ విస్తృత సమావేశం సిపిఎం నాయకులు కంచర్ల సాంబశివరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామా రావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పాదయాత్ర చేస్తూ అర్హులైన పేదలందరికీ పట్టణ, రూరల్ ప్రాంతంలో ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు కావస్తున్నా ఇళ్ల స్థలాలు ఇళ్ల పట్టాల సమస్య పరిష్కారం కాలేదని వెంటనే సమస్యను పరిష్కారం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా తాడేపల్లి పట్టణ ప్రాంతంలో అర్హులైన పేదలకు రెండు సెంట్లు చొప్పున, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు ఇళ్ల స్థలం, ఇళ్ల పట్టాలు ఇచ్చి గృహ నిర్మాణ పథకం కింద, ఒక్కొక్క లబ్ధిదారులకు రూ.ఐదు లక్షలను మంజూరు చేయాలన్నారు. అనేక సంవత్సరాలుగా సిపిఎం అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇళ్లపట్టాలు ఇవ్వాలని పోరాటం చేసిన ఫలితంగానే ఇళ్లపట్టాల సమస్యలపై ప్రభుత్వం ప్రకటన చేసిందన్నారు. తాడేపల్లి మండలం లోని చిర్రావూరు గ్రామంలో పశువుల ఆసుపత్రికి వైద్యుణ్ని నియమించాలని, వడ్డేశ్వరం, కొలనుకొండ, కుంచనపల్లి తదితర గ్రామాలలో ఇళ్ల స్థలాలు, పట్టాల సమస్యను పరిష్కరించాలని, స్థానికంగా మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు. అదే విధంగా మతోన్మాదాన్ని పెంచి పోషించే విధంగా బిజెపి, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ పేరుతో దేవాలయాలపై ఆధిపత్యం చెలాయించేందుకు పూనుకుంటుందని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, నాగ పోగు విజయ రాజు, కారసాల స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పిటిషన్‌ను పరిశీలించి పరిష్కరించాలి : కలెక్టర్

కలెక్టర్ గ్రీవెన్స్‌కు 193 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి పిటిషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఎ. భార్గవ్‌తేజ, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ విజయలక్ష్మి ప్రజల నుండి 193 ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పసుపు రైతులకు న్యాయం చేయాలి

దుగ్గిరాల శుభమ్ మహేశ్వరి కోల్డ్ స్టోరేజి అగ్నిప్రమాదంలో నష్ట పోయిన రైతులకు సత్వరమే పరిహారం అందించాలని బాధిత పసుపు రైతులు గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. జనవరి 19 నాటికి ప్రమాదం జరిగిన సంవత్సరం నిండిందని, ప్రతి క్వింటాకు రూ.7వేలు నష్టపరిహారం ఇస్తామని ఒప్పందం చేసుకొని ఆరు నెలలు నిండిందన్నారు. కానీ ఇంత వరకూ రైతులకు పరిహారం ఇవ్వలేదన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరుగుతూనే ఉన్నామని, ఇన్సూరెన్స్ కంపెనీ హెడ్ ఆఫీసుకు వెళ్లి అడిగామన్నారు. విచారణ పేరుతో రైతుల్ని తిప్పుతూనే ఉన్నారని, మా ఆర్థిక సమస్యలు ఎవ్వరికీ పట్టట్లేదన్నారు. మరోవైపు ఇటీవల వచ్చిన వరదల్లో నష్టపోయి దిక్కు తోచని స్థితిలో ఉన్నారన్నారు. కావున ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పరిహారం వెంటనే



అందచేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో వేములపల్లి వెంకటరామయ్య, గద్దె శ్రీహరి, వెంకటేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి, పేర్ని రవికిషోర్, కోటేశ్వరరావు తదితరులున్నారు.

విశాఖ డెయిరీని సహకార చట్టంలోకి మార్చాలి..

విశాఖ డెయిరీ కంపెనీ చట్టం నుండి సహకార చట్టం పరిధిలోకి తీసుకొచ్చి, ఆస్తులు కాపాడాలని, రైతుల్ని ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ పాల రైతుల సంఘం నాయకులు గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.అజయ్‌కుమార్ మాట్లాడుతూ 1973లో ఏర్పడిన విశాఖ డెయిరీ ప్రభుత్వ సహకారం, రైతుల త్యాగం, సిబ్బంది కృషితో రూ.2వేల కోట్లకు ఆస్తులు చేరాయన్నారు. మొదట సహకార సంఘంగా ఏర్పడిన డెయిరీ తర్వాత మ్యాక్స్ చట్టంలోకి, ఇప్పుడు కంపెనీ చట్టంలోకి మార్చారని, దీంతో ప్రభుత్వ పర్యవేక్షణ లేక అక్రమాలకు అవకాశం కలిగిందన్నారు. గతేడాది సెప్టెంబర్‌లో ఆవు పాల సేకరణ ధర లీటర్‌కు రూ.35ల నుండి రూ.31.4లకు తగ్గించిందన్నారు. దీనికి వ్యతిరేకంగా పోరాటాలు నడస్తుండగానే మరోవైపు పాల సేకరణ కూడా తగ్గిస్తున్నట్లు ఇచ్చిందన్నారు. డెయిరీ ఆస్తులను వ్యక్తిగత ఆస్తులుగా మార్చుతూ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. కావున ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని విశాఖ డెయిరీని రక్షించాలని, అలాగే గుంటూరు



జిల్లాలోని సంగం డెయిరీని కూడా కంపెనీ చట్టం నుండి సహకార చట్టంలోకి మార్చాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శులు ఈమని అప్పారావు, బైరగాని శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా నాయకులు చింతల భాస్కరరావు ఉన్నారు.

నా స్థలంలో గోడను అక్రమంగా కూల్చారు

గ్రామ కంఠం స్థలంలో నాలుగు తరాలుగా తామ కుటుంబం నివశిస్తున్న స్థలంలోని ప్రహరీ గోడను కల్చివేశారని, తనకు న్యాయం చేయాలని ఫిరంగిపురం మండలం, వేములూరిపాడుకు చెందిన పచ్చల చిన్నమ్మ, ఆమె కుటుంబ సభ్యులు అర్జీ అందచేశారు. తన స్థలం సర్వే కోసం గతేడాది డిసెంబర్ 30న అర్జీ పెట్టుకున్నానని, అయితే పంచాయితీ అధికారులు రూ.50వేలు డబ్బులు తీసుకొని గ్రామకంఠానికి 1967లో రిజిస్ట్రేషన్ చేసినట్లు ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించారన్నారు. నా స్థలంలో ఉన్న 80 అడుగుల గోడను పూర్తిగా కూల్చి, ఇల్లు కూడా ధ్వంసం చేశారని వాపోయారు. తాను నివశిస్తున్న స్థలానికి 2012లో సివిల్ కోర్టు నా స్థలంగా తీర్పు ఇచ్చిందని తెలిపారు. కోర్టు తీర్పును కూడా ధిక్కరించి, ఎంఆర్ఒ, ఎస్ఐ కూడా దౌర్జన్యానికి పాల్పడ్డారన్నారు. కావున సర్వే



చేయించి, నా స్థలం నాకు ఇప్పించాలి, గోడ కూల్చినందుకు పరిహారం ఇవ్వాలని కోరారు.

ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీ అరికట్టాలి : ఎస్ఎఫ్ఐ

ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీలను అరికట్టాలని విద్యార్థి సంఘాల నాయకులు గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. రాష్ట్రవ్యాప్తంగా నారాయణ, శ్రీ చైతన్య వంటి కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. పెద్ద మొత్తంలో ఫీజులు దోపిడీ చేస్తూ విద్యార్థుల ప్రాణాలు పోతున్నా మాకు సంబంధం లేదు అన్నట్లు వ్యవహరిస్తున్నాయన్నారు. ఫీజులు చెల్లించకపోతే కళాశాల లోపలికి అనుమతులు లేవని, పరీక్షలకు హాల్ టికెట్స్ ఇవ్వం అని విద్యార్థులను బెదిరిస్తున్నారన్నారు. దీంతో మానసికంగా కుంగిపోయిన అనంతపురం జిల్లాలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న చరణ్ అనే విద్యార్థి ఇటీవల భవనం పైకి ఎక్కి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. విద్యార్థి మృతికి కారణమైన



నారాయణ విద్యాసంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. అటువంటి కాలేజీలు అన్నింటిపైనా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీ ఇచ్చిన వారిలో ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు సమీర్, యశ్వంత్, ఎఐఎస్ఎఫ్ నాయకులు శశి తదితరులున్నారు.

జిఎంసి గ్రీవెన్స్, డయల్ యువర్ కమిషనర్‌కు 73 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అందించే అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అదేశించారు. సోమవారం జిఎంసి ప్రధాన కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుండి అందిన 25 ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం గ్రీవెన్స్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి నేరుగా 48 అర్జీలు స్వీకరించారు. వాటిని సకాలంలో పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులకు అందచేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్,


అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

ఎస్.ఈ. నాగమల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు పాల్గొన్నారు.